Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
3-1-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక:52

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ ముస్తాబు



2లో

## కాలం చెల్లిన ఫర్నేస్ బాయిలరే కొంపముంచిందా?

ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో విస్ఫోటనం ఘటనపై మల్లగుల్లాలు

చికిత్స పొందుతూ ఒకరు మృతి..ఇద్దరి పరిస్థితి విషమం

యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ కార్మికుల ఆందోళన

పూర్తిస్థాయి విచారణ చేస్తాం: ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ

పెళ్లకూరు: 25 టన్నుల సామర్థ్యం ఉన్న ఫర్నేస్ బాయిలర్‌కు కాలం చెల్లిన కారణంగానే.. ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో ఫర్నేస్ విస్ఫోటనం ఘటన చోటు చేసుకుందని కార్మికులు ఆరోపిస్తున్నారు.



2లో

## సిఎంఆర్ కాలేజీ హాస్టల్‌లో రహస్య చిత్రీకరణ

విద్యార్థుల ఆందోళనపై మహిళా కమిషన్ స్పందన

సుమోటాగా కేసు నమోదు...నివేదిక ఇవ్వాలని కమిషనర్‌కు ఆదేశం



# అన్నింట్లో మన రాష్ట్రం ప్రత్యేకతను చాటాలి

## ట్రాఫిక్ నుంచి డ్రగ్స్, గంజాయి నియంత్రణ వరకూ

ఠాణాకో క్యూఆర్ కోడ్.. స్కాన్ చేసి ఫిర్యాదులు

వాటిని క్రోఢీకరించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది

పేదలైనా, ధనికులైనా చట్టం, న్యాయం ఒకేలా ఉండాలి

ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ టెక్నాలజీని వాడాలి

ఒకే గొడుగు కిందకు హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి

ప్రభుత్వంపై ప్రజలకు ఒక భరోసాను కల్పించాలి

పోలీసు ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



2లో

హైదరాబాద్: "రాష్ట్రవ్యాప్తంగా పోలీసు స్టేషన్లలోని సిబ్బంది పనితీరు, వ్యవహార శైలిపై ఎప్పటికప్పుడు నివేదికలు సేకరించాలి. ఇందుకోసం ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక 'క్యూఆర్' కోడ్ ఇవ్వాలి. ఫిర్యాదు చేయడానికి ఎవరైనా పోలీసు స్టేషన్‌కు వెళ్లారని అనుకుందాం. అప్పుడు అక్కడి సిబ్బంది వారితో వ్యవహరించిన విధానాన్ని తెలిపేందుకు ఈ క్యూఆర్ కోడ్ ఉపయోగపడనుంది. దానిని స్కాన్ చేయగానే.. ఫోన్‌లోనే పలు ప్రశ్నలతో కూడిన ఒక పేజీ రావాలి. సంబంధిత వ్యక్తులు తమ అభిప్రాయాన్ని అందులో నమోదు చేస్తారు. ఇలా వచ్చిన అభిప్రాయాలను క్రోఢీకరించి, వాటిపై ప్రభుత్వం ఒక నిర్ణయం.. ఆపై చర్యలు తీసుకుంటుంది" అంటూ పోలీసు శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. న్యాయం విషయంలో పేద, ధనిక అనే తేడా లేకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పేదవారైనా, ధనికులైనా ప్రభుత్వానికి అందరూ సమానమేనని, ఎట్టి పరిస్థితుల్లో న్యాయం ఏ ఒక్కరికీ చుట్టంగా వ్యవహరించకూడదని వ్యాఖ్యానించినట్టు తెలిసింది.



# 13 నుంచి సీఎం రేవంత్ విదేశీ పర్యటన

15 వరకు ఆస్ట్రేలియాలో.. క్రీడలకు ప్రోత్సాహం, శిక్షణపై అధ్యయనం చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

19 నుంచి 21 వరకు సింగపూర్‌లో పర్యాటక అభివృద్ధిపై పరిశీలన

21 నుంచి 23 వరకు దావోస్‌లో.. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొననున్న రేవంత్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13 నుంచి విదేశాల్లో పర్యటించనున్నారు. 13న ఆస్ట్రేలియా వెళ్లనున్న ఆయన.. అక్కడ క్వీన్స్‌ల్యాండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శిస్తారు.

2లో

## నార్త్ సిటీ మెట్రో' మార్గంలో.. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు

ఎలివేటెడ్ కారిడార్ల డిజైన్లలో మార్పులు

శామీర్‌పేట మార్గంలో 12.1 కిలోమీటర్లు

నాగపూర్ మార్గంలో దాదాపుగా 4 కి.మీ.

పునాది నుంచి పిల్లర్ల దాకా నిర్మాణం

హెచ్ఎండీఏ, హెచ్ఎంఆర్ఎల్‌దే!

గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు

నాడు కేంద్ర సహకారం లేక బుట్టదాఖలు

2లో

## పుస్తక పఠనంతో నిలబడే ధైర్యం వచ్చింది

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

విజయవాడలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన పవన్



## అమరావతిలో రూ.2,733 కోట్ల పనులకు పచ్చజెండా

ఎస్ఐపీబీ ఆమోదించిన రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు ఓకే

మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు అంగీకారం

పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో కొత్తగా 19పోస్టులు

తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకలకు పెంచాలని నిర్ణయం

14 అంశాల ఎజెండాలకు ఏపి క్యాబినెట్ ఆమోదం

## దాడుల వెనక ఐఎస్?

అమెరికా న్యూ ఆర్లిన్స్ ఘటన దుండగుడు

జబ్బార్ కారులో ఇస్లామిక్ స్టేట్ జెండా


నిర్ధారించిన అధ్యక్షుడు జోబైడెన్, ఎఫ్‌బీఐ

ఘటనలో 15కు చేరిన మృతుల సంఖ్య

లాస్ వెగాసలో ట్రంప్ హొటల్ వద్ద కారు

బాంబు పేలుడు, ఒకరి మృతి రెండు ఘటనలకు సంబంధం!: మస్క్

2లో



# అమరావతిలో రూ.2,733 కోట్ల పనులకు పచ్చజెండా

అమరావతి,జనవరి2(ఆర్ఎన్ఎ): అమరావతిలో రూ.2,733 కోట్లతో చేపట్టనున్న పనులతో పాటు సీఆర్డీఏ 44వ సమావేశంలో నిర్ణయం తీసుకున్న రెండు పనులకు ఎపి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు అంగీకారం తెలిపింది.భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతుల జారీ అధికారంపై సమావేశంలో చర్చ జరిగింది. అనుమతులు జారీ చేసే అధికారం మున్సిపాలిటీలకు బదలాయించేలా చట్ట సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీ జరిగినది. మంత్రివర్గ సమావేశంలో 14 అంశాల ఎజెండాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనపై కేబినెట్‌లో చర్చ జరిగింది. జనవరి 8న ప్రధాని మోడీ వైజాగ్ రానున్నారు. వైజాగ్ పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రధాని పర్యటనకు భారీ ఏర్పాట్లు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో కొత్తగా 19పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకలకు పెంచేందుకు, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అంగీకారం తెలిపింది. ఎస్ఐపీబీ ఆమోదించిన రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ, కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. నంద్యాల, వైఎస్ఆర్, కర్నూలు జిల్లాల్లో పవన, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు మంత్రివర్గం అంగీకరించినట్లు తెలుస్తోంది. చిత్తూరు జిల్లాలో హోంశాఖ ఐఆర్ బెటాలియన్ ఏర్పాటుకు కేటాయించనున్న స్థలంపై క్యాబినెట్‌లో చర్చ జరిగినట్లు సమాచారం.అమరావతిలో రెండు ఇంజనీరింగ్ కాలేజీల పనులకు గ్రీన్ సిగ్నల్

ఇచ్చారు.భవనాలు, లేఔట్‌ల అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగిస్తూ చేసిన సవరణ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో కొత్తగా ఐదు సంస్థలు క్లీన్ ఎనర్జీలో రూ.83 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టీసీఎస్ రూ.80 కోట్ల పెట్టుబడులకు అమోదంశ్రీ సత్యసాయి జిల్లా, గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ సంస్థ ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల కోసం ఈ సంస్థ రూ.1,046 కోట్ల పెట్టుబడిలకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలోని 106 ఎకరాల్లో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1,174 కోట్ల పెట్టుబడులకు ఆమోదం ఇచ్చింది. వీటితో పాటు చిత్తూరు జిల్లాలో హోంశాఖ ఐఆర్ బెటాలియన్ ఏర్పాటుకు కేటాయించనున్న స్థలంపై క్యాబినెట్‌లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సీఎం చంద్రబాబు తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని పేర్కొన్న రాష్ట్రంలోని నదుల అనుసంధానం గోదావరి టూ బనకచర్ల ప్రాజెక్టుపై క్యాబినెట్‌లో చర్చ జరిగింది.

ఎస్ఐపిబి అమోదించిన రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ అమోదం తెలపనుంది. ఈ పెట్టుబడులు వలన 2,63,411 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. నెల్లూరు జిల్లా రామయ్యపట్నం లో 6 వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ భారీ రిఫైనరీ ఏర్పాటుకు మంత్రి మండలి అమోదం తెలపనుంది. దీని వలన 2,400 మందికి ఉపాధి కలగనుంది. మొత్తం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు సామర్థ్యంతో ఐదు బ్లాకుల్లో రానున్న ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రోకెమికల్స్ యూనిట్స్, క్రూడ్ ఆయిల్ టెర్మినల్, గ్రీన్ హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు నిర్మించ నున్నారు. వచ్చే 20 ఏళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి రూ. 88,747 కోట్ల ఆదాయం రానుంది.. 2029లోగా మొత్తం ప్రాజెక్టు పూర్తి కానుంది. విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టీసీఎస్ రూ. 80 కోట్ల పెట్టుబడులకు అమోదం తెలపనుంది. దీంతో 2 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా, గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ సంస్థ ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల కోసం ఈ సంస్థ రూ. 1,046 కోట్ల పెట్టుబడిలకు క్యాబినెట్ అమోదం తెలపనుంది. దీని ద్వారా 2,381 మందికి ఉపాధి కలుగనుంది..దీనికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలపనుంది.. రాష్ట్రంలో కొత్తగా ఐదు సంస్థలు క్లీన్ ఎనర్జీలో రూ. 83 వేల కోట్ల పెట్టుబడులకు.. వీటితోపాటు సీఎం చంద్రబాబు తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని పేర్కొన్న రాష్ట్రంలోని నదుల అనుసంధానం గోదావరి టూ బనకచర్ల ప్రాజెక్టుపై క్యాబినెట్‌లో చర్చకు వచ్చే అవకాశం ఉంది. గడిచిన ఆరు నెలల పాలన రానున్న ఏడాది పాలనలో తీసుకురావాల్సిన మార్పులు చేర్పులపై మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే మంత్రులందరి నుంచి పర్ఫామెన్స్ రిపోర్టులను తీసుకున్న సీఎం... వాటి పైన, తన వద్ద ఉన్న రిపోర్టుల వివరాలతో కలిపి క్యాబినెట్లో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది.

# మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ ముస్తాబు

**న్యూఢిల్లీ , (క్రైమ్ మిర్రర్):** జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ఈ కుంభమేళాకు బాంబు బెదిరింపులు రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఓ ఎక్స్ యూజర్ ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. మతపరమైన ఈ కార్యక్రమానికి హాజరయ్యే కనీసం 1,000 మందిని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన యూపీ పోలీసులు సదరు ఎక్స్ యూజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. కాగా, మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరిచేం అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

## 13 నుంచి సీఎం రేవంత్ విదేశీ పర్యటన

అక్కడ క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, మౌలిక సదుపాయాలను పరిశీలిస్తారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. 15న సీఎం రాష్ట్రానికి తిరిగి రానున్నారు. మళ్లీ ఈ నెల 19 నుంచి 21 వరకు సింగపూర్‌లో పర్యటించనున్నారు. తెలంగాణలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కొత్త పర్యాటక పాలసీని ప్రకటించిన నేపథ్యంలో... సింగపూర్‌లో పర్యాటకాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తారు. ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకోవడానికి సింగపూర్ ఎలాంటి సౌకర్యాలను కల్పిస్తోందన్న అంశాన్ని అధ్యయనం చేస్తారు. అనంతరం ఈ నెల 21 నుంచి 23 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించి వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొంటారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటారు. దావోస్ పర్యటనకు సీఎంతో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు వెళ్లనున్నారు.

# దాడుల వెనక ఐఎస్?

న్యూయార్క్: ట్రంప్ సర్కారు కొలువుదీరే వేళ.. ప్రజలంతా కొత్త సంవత్సరం వేడుకల్లో మునిగి ఉండగా.. అమెరికాలో ఉగ్రవాద ఘటనలు కలకలం రేపుతున్నాయి. వరుస ఘటనలతో అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున న్యూ ఆర్లిన్స్‌లో.. ఐఎస్ ఉగ్రవాద సంస్థ నుంచి ప్రేరణ పొందిన మాజీ సైనికుడు షంషుద్దీన్ జబ్బార్ ట్రక్కుతో దాడి చేసి 15 మందిని పొట్టనబెట్టుకోగా.. లాస్ వెగాసలోని ట్రంప్ హోటల్ సమీపంలో కారు బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. న్యూయార్క్ క్వీన్స్‌కౌంటీలో.. అమజురా నైట్‌క్లబ్‌లో కాల్పుల ఘటన నమోదైంది. ఇక్కడ 11 మందికి గాయాలయ్యాయి. న్యూ ఆర్లిన్స్ ఘటనలో నిందితుడిని షంషుద్దీన్ జబ్బార్(42)గా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) అధికారులు గుర్తించారు. అతణ్ని పోలీసులు కాల్చి చంపగా.. ఘటనకు ఉపయోగించిన కారు లో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) జెండా, పేలుడు పదార్థాలున్నట్లు నిర్ధారించారు. అతను ఒంటరి తోడేలు(లోన్ వోల్ఫ్) దాడి చేసి ఉంటాడని భావిస్తున్నారు. టెక్స సకు చెందిన జబ్బార్ అమెరికా పౌరుడు కాగా.. అతను యుక్తవయసులోనే ఇస్లాం మతాన్ని స్వీకరించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. 2005-15 మధ్య కాలంలో అమెరికా సైన్యంలో మానవ వనరులు-సమా చార విభాగంలో మేనేజర్‌గా పనిచేశాడు.

## కాలం చెల్లిన ఫర్నేస్ బాయిలరే కొంపముంచిందా?

బుధవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో అధికారికంగా ఒకరు మృతి చెందగా.. ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో ముగ్గురు చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని యాజమాన్యం చెబుతున్నది. వివరాల్లోకి వెళితే..తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి గ్రామ సమీపంలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలోని ఫర్నేస్ బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు భారీశబ్దంతో పేలిపోయింది. ఘటన విషయం తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమ వద్దకు చేరుకున్నప్పటికీ లోపలికి వెళ్లేందుకు సాహసించలేదు. మంటల ఉధృతి తగ్గిన అనంతరం కార్మికుల సహకారంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తీసుకెళ్లారు. చెన్నైలో చికిత్స పొందుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు సిపాయిలాల్ (30) ప్రాణాలు కోల్పోగా, రమిభర్వాజ్, సోను పరిస్థితి విషమంగా ఉంది. వీరితో పాటు విశ్వకర్మ, మణి, మహ్మద్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు.


## పుస్తక పఠనంతో నిలబడే ధైర్యం వచ్చింది

**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** విజయవాడ: తనకు జీవితంలో నిలబడే ధైర్యాన్నిచ్చింది పుస్తకాలేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన 35వ పుస్తక మహోత్సవాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు సాహితీ వేత్తగా, రచయితగా మహోన్నతులు అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పీవీ నరసింహారావు జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. పీవీ గురించి మాట్లాడే అంత జ్ఞానం తనకు లేదని చెప్పారు. తనకు అంత జ్ఞానం వచ్చాక మాట్లాడతానని అన్నారు. పీవీ తన గ్రంథాలయం తీసుకుని ఏపీకి వద్దామనుకున్న సమయంలో ప్రధాని అయ్యారని గుర్తుచేశారు. ఢిల్లీలో పీవీకి సరిగ్గా ఖనన కార్యక్రమం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీవీకి నివాళి అర్పించడానికి ఢిల్లీలో సమాధి లేదన్నారు. లక్షల మంది ముందుకు వచ్చి ఢిల్లీలో స్మృతి వనం ఏర్పాటు చేసేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# నార్త్ సిటీ మెట్రో మార్గంలో.. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: నూతన సంవత్సర కానుకగా మేడ్చల్, శామీర్‌పేట వరకూ మెట్రో పొడిగింపు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర సర్కారు.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చేందుకు ఇప్పటికే నిర్ణయించిన ఎలివేటెడ్ కారిడార్లను డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లుగా మార్పు చేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా హెచ్ఎండీఏ.. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి డిజైన్లు రూపొందించింది. ఈమేరకు.. శామీర్‌పేట మార్గంలో 12.1 కిలోమీటర్ల మేర.. కండ్లకోయ మార్గంలో సుమారు 4 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. కొత్త డిజైన్ ప్రకారం.. కింద రోడ్డు, ఆ తర్వాత ఫ్లైఓవర్, ఆ పై మెట్రో రానుంది. దేశంలో ఒక్క నాగపూర్‌లో మాత్రమే ఈ తరహా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ఉంది. నిజానికి గత ప్రభుత్వ హయాంలోనే ఈ మార్గాల్లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల ప్రతిపాదనలు వచ్చాయి. అయితే, అందుకు ఆ మార్గంలో రక్షణ శాఖకు సంబంధించిన 150.414 ఎకరాల స్థలం కావాలని అప్పట్లో తేల్చారు. ఆ స్థలాలను ఇస్తే అందుకు బదులుగా 500 ఎకరాలు ఇస్తామని నాటి సర్కారు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కానీ, కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడంతో ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. రేవంత్ సర్కారు కూడా నిరుడు ఈ మార్గాల్లో రెండు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలని నిర్ణయించింది. ఈమేరకు సీఎం రేవంత్ అల్వాల్‌లో, కండ్లకోయ వద్ద శంకుస్థాపన కూడా చేశారు. హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు వెస్ట్ మారేడుపల్లి, కారా?నా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట, తూంకుంట మీదుగా 18.100 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను ఆరు లేన్లుగా రూ.2232 కోట్లతో నిర్మించేందుకు పాలన అనుమతులు వచ్చాయి. ఇక జాతీయ రహదారి 44లోని హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి సుచిత్ర సమీపంలో ఉన్న డైరీ ఫామ్ రోడ్డు వరకు గల 5.320 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను ఆరు లేన్లుగా రూ.1580 కోట్లతో నిర్మించేందుకు పాలన



అనుమతులిచ్చారు. ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణశాఖకు చెందిన 169.33ఎకరాలు కీలకంగా మారాయి. అందులో ఎయిర్‌పోర్టుకు చెందిన 23ఎకరాలు మినహా రక్షణశాఖకు చెందిన దాదాపు 126 ఎకరాల భూసేకరణ పూర్తయ్యింది. పదిరోజుల్లో పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఇటీవల హెచ్ఎండీఏ అధికారులు ప్రకటించారు. అయితే.. ఈ మార్గంలో తాజాగా.. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు 22కిలోమీటర్ల మేర మెట్రో నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఎలివేటెడ్ కారిడార్ల డిజైన్లను మార్చాలని ప్రభుత్వం సూచించింది. ఈమేరకు హెచ్ఎండీఏ అధికారులు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి డిజైన్లు రూపొందించారు. అయితే హెచ్ఎండీఏ ప్రతిపాదించిన రెండు ఎలివేటెడ్ కారిడార్లలో ఎంత వరకూ ఫ్లైఓవర్ మార్గం వస్తుందో.. అందులోనే డబుల్ డెక్కర్ నిర్మాణానికి అధికారులు డిజైన్లు చేసినట్లు తెలిసింది. రెండు ఎలివేటెడ్ కారిడార్లకు రూ.3812కోట్ల వ్యయం కానుండగా.. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు నిర్మాణ వ్యయం మరింత పెరుగనుంది.

# సీఎంఆర్ కాలేజీపై మహిళా కమిషన్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

మేడ్చల్ రూరల్: మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలలో విద్యార్థినులు గురువారం కూడా ఆందోళన కొనసాగించారు. కళాశాల క్యాంటీన్‌లో పనిచేసే యువకులు బుధవారం గర్ల్స్ హాస్టల్ బాత్‌రూంలో మొబైల్ ఫోన్లు ఉంచి విద్యార్థినుల వీడియోలను చిత్రీకరించే ప్రయత్నం చేసిన విషయం తెలిసింది. ఈ విషయాన్ని గుర్తించిన విద్యార్థినులు బుధవారం మధ్యాహ్నం నుంచి ఆందోళన చేపట్టారు.విద్యార్థులకు మద్దతుగా విద్యార్థి సంఘాలు హాస్టల్ వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున నిరసన తెలపటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మహిళా కమిషన్.. కళాశాలకు నోటీసులు జారీ చేసింది. కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ కళాశాలలో గురువారం విచారణ జరిపారు. సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని పోలీసులను కూడా కమిషన్ ఆదేశించింది.హాస్టల్ బాత్‌రూంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ వీడియోలు చిత్రీకరిస్తున్నారని విద్యార్థినులు హాస్ట ల్ వార్డెన్ ప్రీతిరెడ్డికి తెలిపారు. అయితే, సమస్యను పరిష్కరించాల్సిన వార్డెన్.. తమనే తప్పుపడుతూ దురుసుగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించారని విద్యార్థులు ఆరోపించారు. వీడియోలు తీయటానికి ప్రయత్నించింది హాస్టల్ మెస్‌లో పనిచేసే ఇతర రాష్ట్రాల కార్మికులే అని తెలుపగా.. మీరే మగవారిని చూసి అలా ప్రవర్తిస్తున్నారని వార్డెన్ దారుణంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయం బయటకు చెప్తే మీ వీడియోలు కూడా బయటకు వెళ్తాయని వార్డెన్ అనటంతో ఆగ్రహించిన విద్యార్థినులు ఆందోళనను మరింత తీవ్రం చేశారు. పరిస్థితి విషమించటంతో వార్డెన్ బుధవారం అర్ధరాత్రే అక్కడి నుండి దొడ్డిదారిన వెళ్లిపోయింది.

**పోలీసుల అదుపులో వార్డెన్**

ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మెస్‌లో పనిచేసే ఐదుగురితోపాటు హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డి, మెస్ ఇన్‌చార్జి సెల్వంను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన విషయంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కనిపించిందని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హాస్టల్ బాత్‌రూంల సమీపంలోనే మెస్‌లో పనిచేసే 12 మంది కార్మికులకు గదులు కేటాయించడమే ఈ ఘటనకు కారణమని చెప్పారు. అనుమానితుల నుంచి స్వాధీనం చేసుకున్న 12 మొబైల్ ఫోన్లలో అభ్యంతరకరమైన ఎలాంటి వీడియోలు లభ్యం కాలేదని పేర్కొన్నారు. డిలీట్ చేసిన వీడియోలు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఫోన్లను ల్యాబ్‌కు పంపినట్లు వివరించారు.

# అన్నింట్లో మన రాష్ట్రం ప్రత్యేకతను చాటాలి

నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన వివిధ శాఖల ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యాలతోపాటు ప్రభుత్వంపై ప్రజలకు ఒక భరోసా కల్పించేందుకు అవలంభించాల్సిన విధానాలను వివరించారు. "ట్రాఫిక్ నియంత్రణ నుంచి మహిళల రక్షణ, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, డ్రగ్స్, గంజాయిని అరికట్టే అంశం వరకూ ప్రతీ విషయంలో తెలంగాణ ఒక బ్రాండ్‌గా మారాలి. అందుకోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దాం. ఇతర రాష్ట్రాలు కూడా ఏదైనా అంశంపై అధ్యయనం చేయాలంటే రాష్ట్రంవైపు చూడాలి. ఆ విధంగా రాష్ట్రాన్ని ఒక బ్రాండ్‌గా తయారు చేద్దాం" అని సీఎం రేవంత్ రెడ్డి పలు శాఖల ఉన్నతాధికారులకు నిర్దేశించారు. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధిలో శాంతిభద్రతల విభాగానిదే కీలకపాత్ర అని, ఈ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి కట్టడికి మరింత పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, తెలంగాణను గంజాయి లేని రాష్ట్రంగా మార్చాలని తేల్చి చెప్పారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని, ఇప్పటికే అందుబాటులో ఉన్న 'షీ టీమ్'లను మరింత పటిష్ఠం చేయాలని చెప్పారు. మహిళలకు ప్రభుత్వంపై ఒక భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

**ట్రాఫిక్ నియంత్రణకు అత్యాధునిక టెక్నాలజీ**

రాష్ట్రంతోపాటు ప్రధానంగా రాజధాని హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించారు. దీనికి సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రస్తుతం అవలంభిస్తున్న విధానాలతోపాటు టెక్నాలజీని మరింతగా వినియోగించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఇకపై ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో విధానాలపై చర్చించకూడదని, ఈ విషయంలో రాష్ట్రానికే ప్రత్యేక విధానం ఉండాలని వివరించారు. "ఇందుకు డ్రోన్ టెక్నాలజీని వాడుకోవాలి. ఏ కూడలిలో ఎన్ని వాహనాలు ఉన్నాయి? అవి వెళ్లేందుకు ఎంత సమయం పడుతుందనే అంశాన్ని బేరీజు వేసి సిగ్నల్స్ ఇచ్చే సెన్సర్లతో కూడిన డ్రోన్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చే విషయంపై దృష్టి సారించాలి. తద్వారా ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ వేగంగా కదిలేందుకు అవకాశం ఉంటుంది" అని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది.



## జడ్జిల నియామకాలను వెంటనే చేపట్టండి : వినోద్‌కుమార్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో జడ్జిల నియామకానికి చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో హైకోర్టు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపాను. 2019 డిసెంబర్ 31 నాడు తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు వచ్చింది. కేసీఆర్ హయాంలోనే మేము పార్లమెంట్‌లో ఒత్తిడి చేసిన ఫలితంగా హైకోర్టు జడ్జిల సంఖ్యను 42కు పెంచారు. తెలంగాణ హైకోర్టుకు 42 మంది జడ్జిలు ఉండాలని నిర్ణయం తీసుకున్నా.. ఎప్పుడూ 23 మందికి మించి భర్తీ చేయడం లేదు. తెలంగాణ జడ్జిల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన వారు ఎవ్వరూ లేరు. పూర్తి స్థాయిలో జడ్జిలను నియమిస్తే దళిత, గిరిజన వర్గాలకు కూడా న్యాయం జరుగుతుంది అని వినోద్ కుమార్ పేర్కొన్నారు. హైకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికి పెరిగి పోతోంది.. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటే తప్ప కేసులు తొందరగా పరిష్కారం కావు. సామాజిక న్యాయం న్యాయ వ్యవస్థలో కూడా పాటించాల్సిందే. వేరే రాష్ట్రాల నుంచి తెలంగాణ హైకోర్టులో నలుగురు జడ్జిలు ఉన్నారు. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణకు కూడా న్యాయం జరుగుతుందన్నారు వినోద్ కుమార్. శామీర్ పేటకు మెట్రో రైల్ ప్రాజెక్టు వస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల కష్టాలు పోవాలంటే నాగపూర్ తరహాలో జేబీఎస్ నుంచి శామీర్ పేట వరకు డబుల్ డెక్ ఫ్లై ఓవర్‌ను ఏర్పాటు చేయాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

## పెరిగిన గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఓట్లు

### రెండు విడతల్లో 3,41,313 మంది నమోదు

**నిజామాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఈ ఏడాది మార్చిలో నిర్వహించనున్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 2019 ఎన్నికల్లో 1.96 లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకోగా.. ఈ సారి రెండు విడతల్లో 3,41,313 మంది ఎన్ రోల్ చేసుకున్నారు. వీరిలో 2,18,060 మంది మేల్ గ్రాడ్యుయేట్స్ ఉండగా, ఫిమేల్ గ్రాడ్యుయేట్లు 1,23,250 మంది, థర్డ్ జెండర్ గ్రాడ్యుయేట్లు ముగ్గురు ఉన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో కలిపి టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 25,921 మంది నమోదు చేసుకున్నారు. వీరిలో పురుషులు 16,364 మంది, స్త్రీలు 9,557 మంది ఉన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో ఓటరు నమోదుకు సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు అవకాశం కల్పించారు. డిసెంబర్ లో మరో చాన్స్ ఇచ్చారు. కొత్తగా ఏర్పడిన 15 జిల్లాల పరిధిలోని 271 మండలాల్లో ఎన్ రోల్ మెంట్ జరిగింది. ఎమ్మెల్సీ క్యాండిడేట్లుగా పోటీ చేయాలనుకుంటున్న వారు 'మిస్డ్ కాల్' క్యాంపెయిన్ నిర్వహించారు. ప్రత్యేకంగా టీమ్?లు ఏర్పాటు చేసి.. గ్రాడ్యుయేట్ల నుంచి డిగ్రీ మెమో, ప్రొవిజనల్స్, ఓటరు ఐడీ సేకరించి ఆన్ లైన్ లో అప్లై చేయించారు. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 1,62,464 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 46,409 ఓటర్లు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 67,738 మంది, ఉమ్మడి మెదక్ జిల్లాలో 64,702 మంది నమోదయ్యారు. కొత్త జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా 69,657 మంది ఓటర్లతో కొత్త కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉంది. 2,420 మందితో జయంశంకర్ భూపాలపల్లి జిల్లా(కాటారం, మల్హర్ రావు, మహాదేవ్‌పూర్, పలిమెల, ముత్తారం మండలాలు) చివరి స్థానంలో ఉంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 25,921 మంది టీచర్లు అప్లై చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 4,020 మంది ఉండగా, నిజామాబాద్ జిల్లాలో 3,529 మంది, సిద్ధిపేట జిల్లాలో 3,052 మంది నమోదు చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అతి తక్కువగా 81 మంది నమోదు చేసుకున్నారు.

## ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు

**యాదాద్రి భువనగిరి,(క్రైమ్ మిర్రర్):** మన బియ్యానికి విదేశాల్లో గిరాకీ పెరుగుతున్నది. అక్కడి ప్రభుత్వాలు దిగుమతికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో యాదాద్రి జిల్లా నుంచి ఫిలిప్పీన్స్ దేశానికి బియ్యం ఎగుమతి కానున్నాయి. ఈ మేరకు బియ్యం పంపించడానికి జిల్లాలోని నాలుగు మిల్లులు అంగీకరించాయి. మిల్లుల నుంచి కాకినాడ పోర్ట్ వరకూ బియ్యాన్ని లారీలో పంపిస్తారు. అక్కడి నుంచి ఫిలిప్పీన్స్‌కు తరలిస్తారు.బియ్యం కోసం గతేడాది ఫిలిప్పీన్స్ దేశం.. సర్కారును సంప్రదించింది. దీంతో ఆ దేశంతో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ అప్పట్లోనే చర్చించారు. బియ్యంలో నూక 5 శాతానికి మించకుండా ఎగుమతి చేయాలని ఆ దేశం కోరడంతో రాష్ట్రం నుంచి లక్ష టన్నుల బియ్యం ఎగుమతికి ప్రభుత్వం ఓకే చెప్పింది. పౌరసరఫరా శాఖ కమిషనర్ డీఎస్ చౌహన్ సమావేశం ఏర్పాటు చేసి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేసే విషయంలో మిల్లర్లతో చర్చలు జరిపారు. జిల్లాలోని కాదంబరీ, యాదాద్రి, మల్లికార్జున, విద్య మిల్లుల్లోని బియ్యాన్ని లారీల ద్వారా కాకినాడ పోర్టు వరకూ తరలిస్తారు. అక్కడి నుంచి ఓడల ద్వారా ఫిలిప్పీన్స్?కు పంపిస్తారు. 10 వేల టన్నులను ఫిలిప్పీన్స్?కు పంపించడానికి ఓకే చెప్పాయి. అయితే సీఎంఆర్‌కు 25 శాతం నూకను ప్రభుత్వం అంగీకరించేది.. ఇప్పుడు 5 శాతం నూకతోనే బియ్యం పంపించాల్సి ఉంటుంది.

## నేడు ఇందిరాపార్కు వద్ద మహా సభ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కామారెడ్డి డిక్లరేషన్ అమలుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్న డిమాండ్‌తో సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరిం చుకొని ఈ నెల 3వ తేదీన ఇందిరా పార్కు వద్ద బీసీ మహాసభ పేరిట తెలంగాణ జాగృతి సంస్థ భారీ సభను తలపెట్టనుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. ఎన్నికల సమయంలో బీసీలకు హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక వారికి కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని కవిత ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇప్పుడు అటకెక్కాయని విమర్శించారు.

## చెట్టును ఢీకొట్టిన ఆటో.. 15 మంది కూలీలకు గాయాలు

**మెదక్, (క్రైమ్ మిర్రర్):** కారును తప్పించబోయి ఓ ఆటో చెట్టును ఢీ కొట్టడంతో పలువురు కూలీలు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కల వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ఆటో చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 15 మంది కూలీలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను నర్సాపూర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రైతుబంధు సాయంపై మీనమేషాలు

### రైతులను తగ్గించేలా కసరత్తు సరికాదు

### కెసిఆర్ హయాంలో రైతులందరికీ న్యాయం

### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి వేముల



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సంక్రాంతి నుంచి రైతుభరోసా అమలు చేస్తామన్న రేవంత్ సర్కారు మీనమేషాలు లెక్కిస్తూ రైతులను దగా చేసే ప్రయత్నాల్లో ఉందని మాజీమంత్రి వేముల ప్రశాంత రెడ్డి విమర్శించారు. ఏడాదిగా రైతుబంధును ఆపేసిన కాంగ్రెస్ తీరుపై రైతుల్లో జోరుగా చర్చ జరుగుతున్నదని అన్నారు. రుణమాఫీకి రైతుబంధు డబ్బులను ఉపయోగించి, ఇప్పుడు ఏడాదైనా కాలక్షేపం కబుర్లతో కాలయాపన చేస్తోందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకంలో తీసుకురానున్న మార్పులపై సర్వత్రా ఆందోళన నెలకొన్నదన్నారు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లు అందరికీ పెట్టుబడి సాయం ఇవ్వాలని ఆమన డిమాండ్ చేశారు. రైతుబంధు పథకంలో మార్పులకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎవరికి అన్యాయం చేసినా బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదన్నారు. కుటుంబం యూనిట్‌గా అమలు చేయాలని చూస్తున్నది. అలాగే, ఎన్ని ఎకరాలు ఉన్నా ఐదు లేదా ఏడు ఎకరాలకు మాత్రమే ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. పైగా రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నదని అన్నారు. వీటన్నటిపైనా వివరణ ఇవ్వాలన్నారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి జిల్లాలోని 5 లక్షల మందికి పైగా రైతులకు పెట్టుబడి సాయం ఠంచన్‌గా అందేది. రెండు సీజన్లలో కలిపి రూ.వెయ్యి కోట్ల దాకా రైతులకు లబ్ది చేకూరేది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం ఆగిపోయింది. వానకాలంలో ఇవ్వకుండా ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు.. యాసంగికి సంబంధించి సంక్రాంతికి ఇస్తామని చెబుతున్నదని మండిపడ్డారు..పసుపు పంట సాగు చేసే వారికి ఏడాది కాలం గడిచి పోతున్నది. 9 నెలల పసుపు పంటను సాగు చేసే వారికి ఏ ప్రాతిపాదికన రైతుభరోసా అందిస్తారో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ సర్కారు నాలుగు విడుతల్లో కలిపి కొంత మంది రైతులను మాత్రమే రుణ విముక్తులను చేసిందని అన్నారు. చాలామందికి ఇప్పటికీ మాఫీ జరగేలదని అన్నారు. దీనిపై కప్పదాటు వ్యవహారం సాగిస్తోందని వేముల మండిపడ్డారు. సగం మందికి మొండిచేయి చూపింది. సాంకేతిక కారణాలను చూపి చాలా మందికి రుణమాఫీ ఎగ్గొట్టారు. కుటుంబంలో ఒకరికే రుణమాఫీ అంటూ సగానికి ఎక్కువ మందిని పక్కకు జరిపింది. తాజాగా రైతుభరోసా పథకం అమలులోనూ ఇదే అస్తవ్యస్త విధానం కనిపిస్తుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. రెండు పంట సీజన్లలో కలిపి ఏడాదికి రూ.15 వేల చొప్పున సాయం అందాల్సి ఉండగా, ఇప్పటికీ చిల్లి గవ్వా అందలేదని గుర్తు చేశారు. రైతు డిక్లరేషన్ పేరిట అనేక వరాలు కురిపించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. అమలులో మాత్రం విఫలమైందన్నారు.. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పి కొంత మందికే మాఫీ చేసి చేతులు దులుపుకున్నదన్నారు. రైతుబంధు పథకం అమలు చేయకుండా రైతులను దారుణంగా మోసగించింది. రైతుబంధు కింద ఇస్తున్న రూ.5 వేలను రూ.7,500కు పెంచి రైతుభరోసా పథకం తీసుకొస్తామన్న హామీ ఏడాది దాటినా అమలు కాలేదు. రెండు సీజన్లకు సంబంధించి పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన ప్రభుత్వం.. సంక్రాంతి నుంచి ఇస్తామని ప్రకటించింది.రైతుభరోసా విధివిధానాల ఖరారుపై సర్కారు దృష్టి సారించినా అవి ఏమిటో చెప్పడం లేదన్నారు. అందరికీ పెట్టుబడి సాయం ఇస్తారా? లేక కొందరికే ఇస్తారా? అన్నది తేల్చాలన్నారు. ప్రస్తుతం యాసంగి మొదలై రెండు నెలలు గడిచినా రైతుభరోసాపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టింది. రైతుబంధు డబ్బులు ఇవ్వకపోవడాన్ని ఎత్తిచూపింది. రైతుభరోసాపై అన్నదాతల్లో అలుముకున్న అనుమానాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెడిసెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సాంకేతిక అంశాలతో పాటుగా శాస్త్రీయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అయితే రైతుభరోసాను అందరికీ వర్తింపజేయాలని వేముల డిమాండ్ చేశారు.

## డ్యూటీ విషయంలో ఇద్దరి పోలీసుల మధ్య గొడవ

**సూర్యాపేట,(క్రైమ్ మిర్రర్):** పోలీస్ శాఖలో క్రమశిక్షణ కొరవడుతున్నది. వివాహేతర సంబంధాలు, అవినీతి ఆరోపణలు, ఆత్మహత్యల వంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటుండంతో శాఖ పరువుతీస్తున్నాయి. బుధవారం కుటుంబ కలహాలతో ఓ కానిస్టేబుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహడ్ పీఎస్‌లో విధుల విషయంలో ఇద్దరు పోలీసులు గొడవపడ్డారు. కానిస్టేబుల్ రవి నాయక్, హోంగార్డు శ్రీనివాసులు మధ్య డ్యూటీ విషయమై ఇటీవల తగాదా జరిగింది. విషయం బయటికి పొక్కడంతో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ చర్యలు తీసుకున్నారు. వారిద్దరిని వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక హైదరాబాద్ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ జటావత్ కిరణ్(36) కుటుంబ కలహాలతో ఓ కానిస్టేబుల్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన అతడు నిత్యం భార్య, పిల్లలను వేధిస్తున్నాడు. నూతన సంవత్సరం సందర్భంగా నాలుగు రోజులు ముందుగానే లీవ్ పెట్టాడు. బుధవారం ఉదయం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవ పెట్టుకున్నాడు. ఆ తర్వాత ఇంటి నుంచి వారిని బయటకు పంపి తలుపులు వేసుకుని ఉరేసుకున్నాడు. అదేవిధంగా ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తన భార్యతో సీఐ డానియేల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని




ప్రశాంత్ రెడ్డి అనే వ్యక్తి నల్లగొండ ఎస్పీ రమేశ్ చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐని డీజీపీ కార్యాలయానికి ఎటాచ్ చేశారు. జ్యోతి అనే మహిళ నల్లగొండ టాస్క్‌ఫోర్స్‌లో ఎస్సైగా పనిచేస్తున్న తన భర్త మహేందర్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని తమను పట్టించుకోవడం లేదని, తమకు కారుణ్య మరణం ప్రసాదించాలంటూ ఇద్దరు పిల్లలతో కలిసి కలేక్టరేట్ వద్ద ధర్నాకు దిగింది. అదేవిధంగా కామారెడ్డి జిల్లా భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట కానిస్టేబుల్ శ్రితితోపాటు కంప్యూటర్ ఆపరేటర్ గతేడాది డిసెంబర్ 26న చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారిమధ్య సాన్నిహిత్యమే బలవన్మరణానికి కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నారన్న కారణంతో గతేడాది సెప్టెంబర్‌లో జగిత్యాల జిల్లా రాయికల్ ఎస్సై అశోక్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇలాంటి ఆరోపణలతోనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఏఎస్సై కూడా సస్పెండ్ అయ్యారు. ఇలాంటి ఘటనలు వరుసగా బయటపడుతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే అవినీతి ఆరోపణలు, భూవివాదాలతో పోలీసు శాఖ సతమతం అవుతున్నది.



## భారతీయ జనతా పార్టీకి భారీ షాక్

### బీఆర్ఎస్‌లోకి చేరిన పీవీ మహేశ్ రెడ్డి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** నిర్మల్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి భారీ షాక్ తగిలింది. బీజేపీ సీనియర్ నాయకులు పీవీ మహేశ్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో మహేశ్ రెడ్డి గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా మహేశ్ రెడ్డికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నిర్మల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మహేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## అసదుద్దీన్ పిటిషన్ విచారణకు సుప్రీం ఒకే



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ఇవాళ అంగీకారం తెలిపింది. 1947, ఆగస్టు 15వ తేదీ నాడు మతపరమైన స్థలాల అంశంలో ఎటువంటి చట్టం అమలులో ఉందో, అదే తరహా విధానాన్ని మెయిన్‌టేన్ చేయాలని ఆ పిటీషన్‌లో కోరారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టింది. ప్రార్థనా స్థలాలకు చెందిన కేసులతో లింకున్న వాటికి అసద్ పిటీషన్‌ను జోడించాలని సుప్రీం ఆదేశించింది. ఫిబ్రవరి 17వ తేదీ ఆ పిటీషన్‌పై విచారణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎంపీ అసదుద్దీన్ తరపున అడ్వకేట్ నిజాం పాషా వాదించారు.



## ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళనలు

సూర్యాపేట, జనవరి 2 (ఆర్ఎన్ఎ): సూర్యాపేట జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. మోతె మండలం రావిపహాడ్‌లో ఎన్ఎంకే బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేపడుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీపై స్థానికులు కొద్దిరోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ యజమానులు ఫ్యాక్టరీ నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజా సంఘాలు ఆందోళనలు తీవ్రతరం చేశాయి. బుధవారం రావిపహాడ్‌లోని ఇథనాల్ ఫ్యాక్టరీ ఎదుట వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఇథనాల్ పరిశ్రమను మూసివేయాలంటూ నినాదాలు చేశారు. ఆందోళనల నేపథ్యంలో ఇథనాల్ పరిశ్రమ ఎదుట భారీగా పోలీసులను మోహరించారు. ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఫ్యాక్టరీని నెలకొల్పితే అడ్డుకుంటామని ఆందోళన కారులు హెచ్చరించారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఎడిటోరియల్



**ఇ**రవై నెలల నుంచి మహోగ్రంగా మండుతున్న మణిపూర్‌లో తొలిసారి ఒక చల్లని సాంత్వన వాక్యం వినబడింది. రాష్ట్రంలో ఇంతవరకూ జరిగిన హింసాకాండకు క్షమాపణ కోరుతున్నానని నూతన సంవత్సర ఆగమనవేళ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ ప్రకటించారు. అనుకోనిది చోటు చేసుకున్నప్పుడు క్షమాపణ కోరటంవల్ల వెంటనే అంతా చక్కబడుతుందని అనుకోనవసరం లేదు. కానీ నేరగాళ్లపై చర్య తీసుకుంటారన్న విశ్వాసం కలిగినప్పుడు బాధిత పక్షంలో ప్రతీకార వాంఛ సన్నగిల్లుతుంది. వారిని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలనుకునేవారి ఆటలు సాగవు. కానీ ఇన్నాళ్లుగా మణిపూర్‌లో జరిగింది వేరు. 2023 మే నెలలో ఘర్షణలు రాజుకున్నప్పుడు బీరేన్ సింగ్ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రెండు ప్రధాన తెగలు మొయితీ%-%కుకీలు ఘర్షణ పడుతున్నారన్న సంగతిని గుర్తించటానికే నిరాకరించారు. 'ఇదంతా కుకీ ఉగ్రవాదులకూ, భద్రతా దళాలకూ సాగు తున్న ఘర్షణ' అంటూ భాష్యం చెప్పారు. మొయితీకి చెందిన నేతగా కుకీల తీరుపై ఎలాంటి అభి ప్రాయాలైనా, అభ్యంతరాలైనా ఆయనకు ఉండొచ్చు. కానీ సీఎం హోదాలో అలా మాట్లాడరాదన్న సంగతిని బీరేన్ గ్రహించలేకపోయారు. ఆ వెంటనే రక్షణ దళాల చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ ముఖ్యమంత్రి ప్రకటనను తోసిపుచ్చారు. అవి స్పష్టంగా తెగల ఘర్షణలేనని చెప్పారు. మణిపూర్ హింసకు ఇంతవరకూ 260 మంది బలి కాగా, 60,000 మంది ఇప్పటికీ రక్షణ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. రాష్ట్రం రెండు తెగలమధ్యా చీలిపోయింది. ఒకరి ప్రాంతాల్లోకి మరొకరు వెళ్లే పరిస్థితి లేదు.

రెండు రోజుల క్రితం కేంద్ర హోంశాఖ విడుదల చేసిన నివేదిక గమనిస్తే మణిపూర్ ఎంత అధ్వాన్నంగా ఉన్నదో తెలుస్తుంది. అక్కడ మొయితీ, కుకీ,

# మణిపూర్ చల్లారుతుందా?

జోమీ తెగల పరస్పర ఘర్షణలవల్ల హింసాకాండ రాజుకుందనీ, మిలిటెంట్ల ప్రాబల్యం పెరిగిందనీ నివేదిక సారాంశం. మొత్తంగా ఈశాన్య ప్రాంతంలో అశాంతికి 77 శాతం మణిపూర్ పరిణామాలే కారణమని తెలిపింది. మొయితీ తెగను కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ మణిపూర్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ సమస్యకు మూల కారణం. 2023 మే 3న ఆ తీర్పును వ్యతిరేకిస్తూ మణిపూర్‌లోని ఆల్ ట్రైబల్స్ స్టూడెంట్స్ యూని యన్ నిర్వహించిన ర్యాలీపై మొయితీల దాడి, దానికి ప్రతిగా కుకీలు రెచ్చిపోవటం పరిస్థితిని దిగజార్చింది. చివరకు మహిళలపై గుంపులు దాడిచేసి వారిని వివస్త్రలను చేయటం, నగ్నంగా ఊరే గించి అత్యాచారాలకు తెగబడటం యథేచ్ఛగా సాగాయి. ఇక గృహదహనాలు, ఇతర ఆస్తుల ధ్వంసం వంటివి సరేసరి.

పోలీస్ స్టేషన్లపై, సాయుధ రిజర్వ్ బెటాలియన్ స్థావరాలపై దాడులకు దిగి వేలాది తుపాకులు, రాకెట్ లాంచర్లు, లక్షల తూటాలు అపహరించారు. వేలాదిమంది కొంపా గోడూ వదిలి చెట్టుకొకరు పుట్టకొకరయ్యారు. ఆఖరికి ఇవి మత ఘర్షణలుగా కూడా పరిణమించాయి. వాస్తవానికి ఒక తెగవారంతా ఒకే మతంవారని చెప్పటానికి వీల్లేదు. అయితే కుకీల్లో అత్య ధికులు క్రైస్తవులుకాగా, హిందువులు కూడా ఉంటారు.

మొయితీల్లో కూడా క్రైస్తవ మతాన్ని అనుస రించేవారున్నా వారి సంఖ్య తక్కువ. అత్యధికులు హిందువులు. ఈ పరస్పర వైషమ్యాల పర్యవ సానంగా చర్చిలను ధ్వంసం చేసిన ఉదంతాలు చాలానే ఉన్నాయి. నూతన సంవత్సర వేళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకూ, ప్రధాని నరేంద్ర మోదీకీ సమర్పించిన వినతిపత్రంలో 2023 నుంచి ఇంత వరకూ మణిపూర్‌లో 360 చర్చిలను ధ్వంసం చేశారని 400 మంది సీనియర్ క్రిస్టియన్ నాయకులు తెలియజేశారు. క్రైస్తవులపై దాడులు జరిగిన ఉదంతాలు 720 ఉన్నాయని వారంటున్నారు.

ఘర్షణలు అడపా దడపా ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అపహరించిన ఆయుధాలు అప్ప గించమని పోలీసులు చేసిన వినతి పెద్దగా పనిచేయలేదు. ఇప్పటికీ మొయితీ, కుకీ తెగలవద్ద కుప్ప లుగా ఆయుధాలున్నాయి. ఇందులో అపహరించిన వాటితోపాటు పొరుగునున్న మయన్మార్‌నుంచి వచ్చిపడుతున్న ఆయుధాలున్నాయని పోలీసులు చెబుతున్నారు. మణిపూర్‌తో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాలు ఎంతో వైవిధ్యభరితమైనవి. అక్కడ 400కు పైగా తెగలున్నాయి. భిన్న సంస్కృతులు, విశ్వాసాలకు చెందిన వీరంతా కొన్ని మినహాయింపులతో శతాబ్దాలుగా కలిసిమెలిసి ఉంటున్నారు. అయితే పరిమిత వనరులను ఇంతమందితో పంచుకోవాల్సి రావటంవల్ల అందరిలోనూ భయాందోళనలున్నాయి. ఇది సాయుధ బృందాలకు ఊపిరిపోస్తోంది. తమకు స్వయం పాలిత ప్రాంతాలు కావాలన్న డిమాండ్ బయల్దేరుతోంది. ఈ నేపథ్యంలో అక్కడ ఎంతో జాగ్రత్తగా అడుగు లేయాల్సి వుండగా ఇన్నాళ్లూ మణిపూర్ నిర్లక్ష్యానికి గురైంది.

దేశంతో పాటు ప్రపంచమంతా కొత్త సంవత్సరంలోకి అడుగిడిన వేళ..ప్రజలంతా కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని కోరుకుంటున్న వేళ..రాజకీయ నాయకులు, పాలకులు కూడా అదే ఆశయాలతో ముందుకు సాగితే దేశం పురోగమిస్తుంది. కానీ రాజకీయ నాయకులు ఎల్లవేళలా ఓటుబ్యాంకు దృష్టిలోనే ఆలోచనలు చేస్తున్నారు. అదే కోణంలో పథకాలు గానీ, పనులుగానీ చేస్తున్నారు. దీంతో దేశం ముందుకు సాగడం లేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం,రూపాయి పతనం వంటి సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవే.



# పాలకులు ఆత్మ విమర్శ చేసుకోవాలి!

వాటిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం లేదు. ధరల అదుపునకు చర్యలు లేవు. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా..రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. కొనుగోలుదారులు మాత్రం అధికధరలతో అవస్థలు పడుతున్నారు. ఇకపోతే 140కోట్ల మంది భారతీయులు ఉన్న మన దేశంలో కూలీల కొరతను ఎదుర్కొంటున్నాం. వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. దీనికతంటికి పాలకుల విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులను చేసి, పనులకు దూరం చేస్తున్నారు. ఈ సమస్యలపై చర్చించి ముందుకు సాగాలన్న బలమైన సంకల్పం పాలకుల్లో కొరవడింది. ఐదేళ్లు గడిచేలోగా..మరో ఐదేళ్లకు వేసుకునే ప్రణాళికలతో పాలకులు సాగుతున్నారు. సమిష్టి కృషితో దేశాన్ని ముందుకు నడిపిస్తు న్నామని ప్రధాని మోడీ నూతన సంవత్సరానికి ముందు ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలా అయితే భారతదేశం పురోగమించదని, ప్రజలు సమస్యలు, అప్పులు, పన్నుల భారం నుంచి బయటపడరని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇకపోతే భాగస్వామ్య పక్షాలుగా ఉన్నా టిడిపి,జనసేన తదితర పార్టీలు కూడా చొరవ తీసుకుని మంచి సలహాలు కూడా ఇవ్వలేక పోతున్నాయి. పెన్షన్లు 4వేలకు పెంచి పంచడమే గొప్ప ఘన కార్యాంగా ఎపి సిఎం చంద్రబాబు భావిస్తున్నారు. మంత్రులు, పార్టీ పెద్దల సలహాలు తీసుకుని పాటించే ఆనవాయితీ మోడీకి ఎలాగూ లేదు. కనీసం భాగస్వామ్య పక్షాలతో అయినా చర్చించే పరిస్థితి లేదు. ఇకపోతే గతేడాది అనేక ముఖ్య ఘట్టాలను మనం పరిశీలించవచ్చు. దేశ రాజకీయాలకు సంబంధించినంత వరకు 2024 ఒక చారిత్రక ఘట్టంగా భావించాలి. కొడిగట్టి పోతున్న కాంగ్రెస్‌కు నూనె పోసి దీపం వెలిగించిన ఘనత మోడీదే. మోడీ నిరంకుశ విధానాలతో కాంగ్రెస్ మళ్లీ బతికి బట్టకట్టింది.

అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగడం ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాం. కానీ అయోధ్యలోనే బిజెపి పతనం చెందింది. కారణమేమంటే అక్కడి స్థానికులకు లబ్ది కలిగేలా, వారికి దారి చూపేలా పథకాలు అమలు కాలేదు. అయితే గత సంవత్సరం భారతీయ జనతా పార్టీకి సంబంధించి అత్యంత కీలకమైనదిగానే చెప్పుకోవాలి. రామమందిర నిర్మాణం జరిగిన వెంటనే మోదీ ఎన్నికలకు వెళ్లి ఉంటే ఏమి జరిగేదో కాని, ఆయన ఉన్నట్లుండి వ్యూహం మార్చి పూర్తిగా మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దేశమంతటా మోదీ అనే వ్యక్తి ఆధారంగానే బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తన పేరు చెబితే దేశం దేశం ఏకమై ఉవ్వెత్తున జనం ముందుకు వచ్చి ఓటు వేస్తారని ఊహించుకున్న మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాని ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కాకపోవడంతో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితమయింది. ఇదో రకంగా మోడీకి శరాఘాతంగా భావించాలి. ఈ విఘాతాన్ని అధిగమించాలంటే హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తప్పదని మోదీ గ్రహించారు. అందుకే అన్నిశక్తులూ ఒడ్డి, అన్ని రకాల వ్యూహాలు పన్ని ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందేలా చేయడంతో దేశ రాజకీయ చిత్రపటంపై తనకు తిరుగులేదని అనిపించుకున్నారు. ఎన్నికల్లో గెలవడం తెలుసుకున్న మోడీ

ప్రజల మనసులను మాత్రం గెలవలేకపోతున్నారు. ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజలను నరకయాతన పెడుతున్నా సమీక్షించుకోవడం లేదు. ఈ క్రమంలో 2025 ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీకి సంబంధించి కీలక సంవత్సరంగా భావించాలి. మారుతున్న ప్రపంచ రాజకీయాల నేపథ్యంలో భారత్‌లో కూడా మార్పులు రావాల్సి ఉంది. రాజ్యాంగం, కులగణన, అదానీ కుంభకోణం వంటి అంశాలను లేవనెత్తుతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం కూడా అంత సులభం కాదు. పార్లమెంట్ చర్చలకు వేదిక కాకుండా కుమ్ములాటలకు రంగస్థలం కావడంపై ప్రతిపక్షాల కంటే మోదీయే జవాబుదారీ కావల్సి ఉంటుంది. మోడీ ఇంతవరకు గట్టిగా నిలబడి ఏదేని సమస్యపై చర్చించిన దాఖలాలు లేవు. పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం లేకుండా పోతున్నది. 2024లో దేశంలో దాదాపు పది సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం, ఈ ప్రభుత్వంలో తెలుగుదేశం వంటి దక్షిణాది పార్టీ ప్రధాన భాగస్వామి కావడం, ప్రధాన రాజకీయ పార్టీలు రెండు ప్రధాన కూటములుగా ఏర్పడడం మరో ముఖ్యమైన పరిణామం అని చెప్పక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు చెందని ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షను ఎదుర్కొంటున్నాయి. బీఆర్ఎస్, బీజేడి, వైసీపీ, ఆమ్‌ఆద్మీ పార్టీలు మనుగడకోసం కష్టపడు తున్నాయి. 2025 ఈ విషయంలో మరింత స్పష్టత నిస్తుందనడంలో సందేహం లేదు. అయితే మోడీ తన ఆర్థిక విధానాలను, పాలనా తీరును సమీక్షించుకోక తప్పదు. లేకుంటే మోడీ అస్తిత్వం కూడా ప్రశ్నార్థకం కాగలదు. దేశానికి దిశదశ చూపేలా రాజకీయాలు చేయాలి. ప్రజల బాటలో నడవాలి. అప్పుడే మోడీ నిలుస్తారు.

## టీమిండియా ఆటతీరుతో బేజార్

### తీవ్ర ఒత్తిడిలో హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్

మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి.. మరోవైపు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే అవకాశాలు పూర్తిగా సంక్లిష్టం.. ఈనేపథ్యంలో టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం పూర్తిగా వేడెక్కినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల టీమ్‌ఇండియా ఫలితాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆటగాళ్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలోని నాలుగో టెస్టులో తీవ్రంగా నిరాశపరిచిన స్టార్‌ప్లేయర్ల ఆటతీరుపై గంభీర్ ÷ర్ అయినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగివచ్చిన ఆటగాళ్లపై అతడు మండిపడినట్లు తెలుస్తోంది. ఇక చేసింది చాలు అని పేర్కొనట్లు సమాచారం. కొంతమంది ఆటగాళ్లు పేలవ షాట్లు ఆడి వికెట్లు కోల్పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. కోచ్‌గా బాధ్యతలు చేపట్టగానే.. ఆటగాళ్లు వారి మార్గాల్లోనే ఆడేందుకు గంభీర్ ఆరు నెలలు స్వేచ్ఛ ఇచ్చాడని.. కానీ ఇప్పుడు అదంతా ముగిసిందని పలువురు అంటున్నారు. ఇప్పటినుంచి జట్టు వ్యూహాలకనుగుణంగా ఆడనివారిపై వేటు వేసే దిశగా చర్యలు ఉంటాయని అతడు సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్‌కనుగుణంగా గంభీర్ తీసుకుంటున్న వ్యూహాలకు.. మైదానంలో ప్లేయర్ల ఆటతీరుకు మధ్య పొంతన ఉండటం లేదనే దానిపై చర్చ నడుస్తోంది. ఇటీవల ముగిసిన టెస్టులో రిషభ్ పంత్ బాధ్యతారాహిత్యంగా ఆడి వికెట్ సమర్పించు కున్నాడు. అదే మ్యాచ్‌ను కోల్పోవడంలో కీలకంగా మారింది. మరోవైపు కోహ్లీ మరోసారి తన బలహీనతను చాటుకొని స్లిప్‌లో చిక్కాడు. ఇక రోహిత్ శర్మ ఏ స్థానంలో వచ్చినా.. రాణించలేకపోతున్నాడు. మెల్‌బోర్న్ టెస్టులో రెండో ఇన్నింగ్స్‌ను జాగ్రత్తగా ప్రారంభించినప్పటికీ.. చివరికీ తన పాత ఆటతీరునే కొనసాగించి విఫలమయ్యాడు. ఇలా సీనియర్ల ఆటతీరు గంభీర్‌ను బాధించిందని.. త్వరలోనే తీవ్రమైన చర్యలకు అతడు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాహుల్ ద్రవిడ్ అనంతరం హెడ్ కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. టీమ్‌ఇండియాకు మిశ్రమ ఫలితాలే వస్తున్నాయి. శ్రీలంకతో వన్డే సిరీస్‌లో ఓటమి, స్వదేశంలో న్యూజిలాండ్‌పై వైట్‌వాష్, తాజా బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కోచ్‌పైనా విమర్శలు వస్తున్నాయి.

**భారత్** సహా ప్రపంచ దేశాలన్నీ 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారత్‌లో ఏ వస్తువుల ఎక్కువగా ఆర్డర్ చేశారో తెలుసుకోవాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది. కొందరు ఫుడ్ ఆర్డరిస్తే, కొందరు డ్రింక్స్ పెడుతుంటారు. డిసెంబర్ 31న భారతీయులు ఎక్కువగా ఆర్డర్ చేసిన ఐటమ్స వివరాలను ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజాలు బ్లింకిట్, స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ షేర్ చేశాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అత్యంత ప్రజాదరణ పొందిన వస్తువుల వివరాలను నెటిజన్లతో షేర్ చేసుకున్నారు. ఊహించినట్లగానే కొత్త సంవత్సరంలో పార్టీలు బాగా జరిగాయి. దేశవ్యాప్తంగా ప్రజలు స్నాక్స్ ఎక్కువ బుక్ చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్‌లో 2.3 లక్షల ఆలూ భుజియా ప్యాకెట్లు ఐస్ క్యూబ్‌ల ఆర్డర్‌లు 1290 శాతం పెరిగాయి. 7:41 గంటల సమయంలో 119 కిలోలు ఐస్ క్యూబ్స్ డెలివరీ అయ్యాయని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. బిగ్‌బాస్కెట్‌లో నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్ విక్రయాలు 552 శాతం పెరిగాయి. డిస్పోజబుల్ కప్పులు, ప్లేట్‌ల ఆర్డర్స్ సైతం 325 శాతం పెరిగాయి. సోడా, మాక్‌టెయిల్ విక్రయాలు సైతం 200 శాతం పెరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా

అత్యధిక విక్రయాలు జరిగిన మరో ఐటమ్ కండోమ్స్. డిసెంబర్ 31 మధ్యాహ్నం వరకే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 4,779 ప్యాక్‌ల కండోమ్స్ డెలివరీ చేసింది. సాయంత్రం తరువాత నిరోధ్‌ల విక్రయాలు మరింత పెరిగాయి. బ్లింకిట్‌లో సైతం కండోమ్ అమ్మకాలు భారీగా పెరిగాయి. 1.2 లక్షల కండోమ్‌ల ప్యాకెట్లు డెలివరీ చేశామని వెల్లడించారు. లో

## న్యూ ఇయర్ వేడుకల్లో భారీగా ఆన్‌లైన్ బిజినెస్



డెలివరీ అయ్యాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సైతం గత రాత్రి 7.30 గంటలకే నిమిషానికి 853 చిప్స్ ఆర్డర్‌లు వచ్చాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లో అత్యధిక బుకింగ్స్ పాలు, చిప్స్,చాక్లెట్, ద్రాక్ష, పన్నీర్ ఐటమ్స్ ఉన్నాయని వెల్లడించింది. కూల్ డ్రింక్స్, ఐస్ క్యూబ్స్ కూడా భారీగా ఆర్డర్ చేశారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్ ద్వారా డెలివరీ 6,834 ఐస్ క్యూబ్స్ ప్యాకెట్లు, అదే సమయానికి బిగ్ బాస్కెట్‌లో దుస్తులు సైతం కొందరు ఆర్డర్ పెట్టడం విశేషం.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కస్టమర్ కళ్లకు గంతలు కట్టి, చేతికి సంకెళ్లు కావాలని ఆర్డర్ చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. వీటితో పాటు గతంలో ఎన్నడూ లేనంతగా కూల్ డ్రింక్స్, చిప్స్ విక్రయాలు పెరిగాయంటే ఎక్కువగా ఇంట్లో కుటుంబసభ్యులతో న్యూ ఇయర్ జరుపుకున్నారని ఈకామర్స్ దిగ్గజాలు చెబుతున్నారు.

# నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు

## క్లబ్ 23వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు కేక్, పండ్లు, బిస్కెట్లు పంపిణి

**గండిపేట్(క్రైం మిర్రర్):** నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపట్టడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకోని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి వెల్లడించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని నవ యువ యూత్ క్లబ్ 23వ వార్షికోత్స వేడుకలు గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి పండ్లు, బిస్కెట్లు పంపిణి చేశారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ క్లబ్ స్థాపించి 23సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. గత రెండున్నర దశాబ్ధాలుగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ కాలనీల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శంకర్ మాట్లాడుతూ క్లబ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత ప్రోత్సహించాలన్నారు. క్లబ్ సభ్యులు పాఠశాల సమస్యలను చర్చింఆచరు. సమస్యల పరిష్కారం కోసం క్లబ్



కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కొంపల్లి జగదీష్, రాజు, కె.కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శి చాంద్ పాషా మృతి

### వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన- ఎంపీడీవో కే ప్రమోద్ కుమార్

**సంస్థాన్ నారాయణపూర్, జనవరి 02(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపుర్ మండల వెంకాంబావి తండ పంచాయతీ కార్యదర్శి చాంద్ పాషా అనారోగ్య కారణాంగా బుధవారం గాంధీ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. గురువారం చాంద్ పాషా స్వగ్రామం శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది. వారి మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియలో పాల్గొన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే ప్రమోద్ కుమార్ ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కే నరసింహ రావు ,ఏపీఓ ప్రశాంతి, మండల పంచాయతీ కార్యదర్శులు బి వెంకటేశం, వి లింగస్వామి, టి వెంకటేశ్వర్లు, ఎన్ వినయ్ , పి గంగా రాములు కంప్యూటర్ ఆపరేటర్ బి లింగస్వామి, రఘు తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది.

# కొత్త సంవత్సరంలో ప్రజలంతా ఆనందంగా ఉండాలి

### మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి



**గండిపేట్(క్రైం మిర్రర్):** కొత్త సంవత్సరం ప్రజలందరికి ఆనందాన్ని, సంతోషాన్ని ఇవ్వాలని మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మణికొండలో నాయకులు, కార్యకర్తలతో కలిసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి కార్యకర్తలకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్దొళ్ల శ్రీరాములు, రాజిరెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్లు బాలిరెడ్డి, ఏర్పుల కుమార్, నాయకులు లక్ష్మయ్య, గంగాధర్, శివగంగా, స్పందన, మల్లేష్, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవితకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రూపారెడ్డి.



**గండిపేట్(క్రైం మిర్రర్):** మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కవతకు పూలబోకే అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎత్తుకు పై ఎత్తే 'చదరంగం'

### అంతర ప్రైవేట్ పాఠశాలల చెస్ పోటీల పారంభోత్సవంలో ప్రభాకరాచారి, శరవణ్ కుమార్.

**గండిపేట్(క్రైం మిర్రర్):** ఎత్తుకు పై ఎత్తు వేస్తేనే చదరంగంలో రాణించగలరని రాజేంద్రగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎం. ప్రభాకరాచారి, ప్రధానకార్యదర్శి జి. శరవణ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. రాచరిక పాలనలో ఒక రాజ్యాం రాజును తన భటులతో ఇతర రాజును సైన్యంతో ఏ విధంగా కట్టడి చేసే వారో నేడు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చెస్ క్రీడ ఉదహరిస్తుందని వారు చెప్పారు. గురువారం మండల స్థాయి అంతర ప్రైవేట్ పాఠశాలల క్రీడోత్సవాల్లో భాగంగా గురునానక్ స్కూల్లోని దశ్మేష్ ఆడిటోరియంలో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల చెస్ క్రీడా పోటీలను వారు జిల్లా సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ. యాదగిరి, మండల సంఘం కోశాధికారి ఎస్ఆర్. రజీనికాంత్, క్రీడలు, సంస్కతిక కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్ లతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చందరంగం ఆటలో మేదాశక్తి ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. చందరంగం ఆట పై విజ్ఞాన పరిజ్ఞానం కలిగి ఉండడంతో పాటు వ్యూహాత్మక ఎత్తులు వేయాలన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి క్రీడా కళానైపుణ్యాన్ని తప్పక ప్రదర్శించాల్సిందేనని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు రాజేంద్రప్రసాద్, కరుణాకర్, మధుసూధన్, మహ్మద్ వాజిద్, శేషు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు పలువురు నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు ఓంప్రకాష్, నర్సింహ్మయాదవ్, మామిడి శెట్టి శ్రీనివాస్ నేత, డి.రాజు, కృష్ణ, పాండు, ఎం.శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో మూలనపడి ఉన్న చెత్త రిక్షాలు


### కార్మికులకు అందించేందుకు మొక్షం ఎప్పుడో...

### తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి



**గండిపేట్(క్రైం మిర్రర్):** కార్మికుల అవసరాల నిమిత్తం తీసుకువచ్చి చెత్త రిక్షాలు మూలనపడి పాడవుతున్నాయి. వీటిని కార్మికులకు అందించే మొక్షం ఎప్పుడు లభిస్తుందో అని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో అనేక నెలలుగా పారిశుధ్య కార్మికులు ఉపయోగించే రిక్షాలు మూలనపడి ఉన్నాయన్నారు. రిక్షాలను కార్మికులకు అందజేయడానికి మొక్షం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారన్నారు. అధికారులు వెంటనే కార్మికులకు అందజేయాలన్నారు. కార్మికులు జాడు కోట్టి చెత్త ఎత్తడానికి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గొనె సంచుల్లో వేసుకోని చెత్తను ఎత్తుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే కార్మికులకు చెత్త రిక్షాలను అందజేయాలని ఆయన కోరారు.

# కార్తీక్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు



**గండిపేట్(క్రైం మిర్రర్):** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకోని యువ నాయకుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌లకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు ధర్మారెడ్డి, రాఘవేందర్‌యాదవ్, లక్ష్మీరాజ్, సరిత, సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షులు జహీర్, శాస్త్రీపురం డివిజన్ అధ్యక్షులు ముక్రంఖాన్, అరుణ్‌ముదిరాజ్, మైసిరెడ్డి, భగవాన్‌దాస్, సరికొండ దుర్గేష్, సురేష్, పటేల్, ఉప్పల్ శ్రీను, కార్తీక్‌ముదిరాజ్, అశోక్‌కుమార్, మహేష్, రాయుడు, రాజ్‌కుమార్, రిషి తదితరులు పాల్గొన్నారు.



# ప్యూర్ అండ్ సెఫ్ వాటర్‌ను బండ్లగూడ జాగీరు ప్రజలకు అందిస్తాం

## బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్



**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫిల్టర్ బెడ్స్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు ప్యూర్ అండ్ సెఫ్ వాటర్‌ను అందించేందుకు పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి సెటివెంటేషన్, కావియేషన్, ఫిల్ట్రైజేషన్ చేసి నాణ్యతకరమైన మంచినీటిని కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు అందజేస్తామన్నారు. శంషాబాద్ నుంచి వచ్చే డ్రైన్ వాటర్ ఇందులో కలుస్తుందని కొంత మంది తప్పుడు ప్రచారం సోషల్ మాధ్యమాల్లో చేపడుతున్నారన్నారు. దీనిని ప్రజలు ఎవరు నమ్మవద్దు అన్నారు. అలాంటి డ్రైన్ వాటర్ కలుస్తుంటే చూస్తు ఊరుకోమని స్పష్టం చేశారు. అలాంటి నీటిని ఎక్కడికక్కడ నిలిపి వేసి దారి మళ్లించే ప్రక్రియ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. హిమాయత్‌సాగర్ నీటిని హైదరాబాద్ ప్రజలకు అందిస్తున్నారన్నారు. మన కార్పొరేషన్‌లోనే ఉన్న హిమాయత్‌సాగర్ నీటిని ఇక్కడి ప్రజలకు అందలేదన్నారు. హిమాయత్‌సాగర్ నీటిని కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు అందిస్తామని గతంలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పనులను కూడా వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన హిమాయత్‌సాగర్ నీటిని అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. ఈ నీటిని ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసి ల్యాబ్ టెస్టులు చేసిన తరువాతనే బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. కొంత మంది కావాలని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు అన్నారు. ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుందన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికే పదవులు

### రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి


### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా వి.రాముడుయాదవ్ నియామకం



**గండిపేట్(క్రైం మిర్రర్):** బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా వి.రాముడుయాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామకపత్రం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావులకోల్ల నాగరాజుతో కలిసి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ రాముడుయాదవ్ పార్టీకి చేసిన కృషి, సేవలు గుర్తించి ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగిందన్నారు. కష్టపడే స్వభావం కలిగి బీఆర్ఎస్ పార్టీ మీద అమితమైన విశ్వాసం, నమ్మకం ఉన్న వ్యక్తి రాముడుయాదవ్ అన్నాడు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధ్యక్షుడు రావులకొల్ల నాగరాజు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి అని గుర్తు చేశారు. కార్పొరేషన్‌లో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారన్న నమ్మకంతో బాధ్యతలు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా రాముడుయాదవ్ మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు. కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం ఏసేపందుకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి అప్పగించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యనిర్వహక అధ్యక్షులు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, పాండు, శాంతికుమారినాయక్, పెంటయ్య, ముళీ, పెంటయ్యయాదవ్, వినోద్, దుర్గేష్, చందర్‌రావు, మహేష్, రాజ్‌కుమార్, ఇస్మాయిల్, జావేద్, మల్లేశ్వరి, మురళీ, పెద్ద కుమార్, సి. హెచ్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఒంటికి నిప్పంటిచుకోని యువకుడి ఆత్మహత్య

**గండిపేట్(క్రైం మిర్రర్):** ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకోని నిప్పంటిచుకున్న సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన మల్లికార్జున్ ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ మధ్య కాలంలోనే తన ఇంటిని నిర్మించుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. తెచ్చిన అప్పులు చెల్లించలేకపోతున్నానే బాధ, ఆర్థిక ఇబ్బందులు తాళ్లలేక లంగర్‌హౌస్ నుంచి గండిపేట్‌కు వెళ్లి అక్కడ ఒంటిపై పెట్రోల్ పోసుకోని నిప్పు అంటించుకున్నాడు. అతడి అరుపులు విన్న స్థానికులు అక్కడకు చేరుకోని మంటలను ఆర్పి వేశారు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. 80 శాతం కాలిన గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



జూబ్లీహిల్స్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని వారి నివాసంలో పుట్టినరోజు సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగిరింత నర్సింహా రెడ్డి టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు

(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)

## నాంపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనికి

### భూ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించాలి

### ఇందిరమ్మ ఇండ్ల సర్వే సమస్య లేకుండా న్యాయబద్ధంగా పరిశీలించాలని ఆదేశించిన:లినల్గొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** ధరణి పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్ నాంపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి ధరణి పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, టి ఎం - 33 మాడ్యూల్ లో ఉన్న పార్టిషన్, సక్సేషన్ తదితర భూములకు సంబంధించిన అన్ని కేసులను వేగవంతం చేసి పరిష్కరించాలని చెప్పారు. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించే వాటికి ఆర్ ఐ, భూ సర్వేయర్లు దరఖాస్తు దారునితో పాటు, క్షేత్రస్థాయికి వెళ్లి జియో కో-ఆర్డినేట్స్ తో సహా వివరాలను సమర్పించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను ఆదేశించారు. అదేవిధంగా ఎం పి డి ఓ తో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఎలాంటి లోటు పాటు లు లేకుండా సమస్యలు తలెత్తకుండా న్యాయపరంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భూమి సమస్యల పరిష్కారానికై తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన టి పి గౌరారం రైతులు ఏలూరి నారాయణరెడ్డి, ఏలూరి వెంకటరెడ్డి లతో మాట్లాడి వారికి సంబంధించిన భూ సమస్యల దరఖాస్తులను స్వీకరించారు. అంతేకాక మరి కొన్ని దరఖాస్తుల పరిష్కారం పై ఆర్డీఓ తో ఫోన్లో మాట్లాడి తక్షణ పరిష్కారం సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు తహసిల్దార్ జి. దేవ సింగ్, ఎంపిడిఓ స్వర్ణ కుమారి, తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం అడుగు ముందుకేసి..!

### వ్యాపారితో ఎమ్మెల్యే వ్యక్తిగత చర్చ

### కోర్టు స్టే తెచ్చుకున్నా.. అడుగు వెనక్కి

### ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధికి తొలగిన అడ్డంకి





**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, షాద్ నగర్:** పట్టణంలో అధికారులు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్డు అభివృద్ధిలో భాగంగా కష్టపడి తాను కొనుగోలు చేసిన ప్లాటు పోతుందని ఓ వ్యాపారవేత్త కోర్టును ఆశ్రయించాడు. కోర్టు స్టే ఇవ్వడంతో అధికారులు అభివృద్ధి పనులను నిలిపివేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సదరు వ్యాపారవేత్తలు కలుసుకొని అభివృద్ధిపై చర్చించారు. వ్యక్తిగత బేష జాలకు పోకుండా అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీంతో మెట్లు దిగివచ్చిన సదరు వ్యాపారి అభివృద్ధి కోసం నేను సైతం అంటూ ఎమ్మెల్యే మాటలను ఏకీభవించారు. దీంతో రోడ్డు విస్తరణ పనులకు మార్గం సుగమయింది. దీంతో ఎమ్మెల్యే అభివృద్ధి మంత్రం ఫలించింది.

**అసలు ఏం జరిగిందీ...**

షాద్ నగర్ పట్టణంలో ఎంతో కాలంగా ఇబ్బందిగా మారిన పాత జాతీయరహదారి విస్తరణ పనుల కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఇదే క్రమంలో పాత జాతీయ రహదారిపై ఉన్న మండవ మురళీదర్ రావుకు చెందిన ఉషోదయ బిల్డింగ్ ముందు ఉన్న కట్టడాలను అప్పట్లో అధికారులు తీసివేసేందుకు ప్రయత్నించగా మురళీదర్ రావ్ అడ్డుకున్నారు. తాను ఎలాంటి ఆక్రమణ చేయలేదని, అన్ని కాగితాలు సరిచూసుకున్న తరువాతే కష్టపడి సంపాదించిన డబ్బులతో ఆస్థి కొనుగోలు చేశానని, ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్చివేతలు చేయరాదని ఖరాఖండిగా తేల్చి చెప్పాడు. అయితే రోడ్డు విస్తరణ కోసం కూల్చి తీరుతామని అదికారులు అతనికి మొండిగా నోటీసులివ్వడంతో చేసేదేమి లేక హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది, దీంతో అధికార యంత్రాంగం ఖంగుతిన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎలాంటి కూల్చివేతలు చేయకుండా ఊరుకుండిపోయారు.

**ఎమ్మెల్యే వ్యక్తిగత చర్చతో..**

పట్టణాభివృద్ధిలో బాగంగా జాతీయ రహదారి విస్తరణ కోసం ఇతర పార్టీల నాయకులను ఏకతాటిపైకి తేవండంలో షాద్నగర్ ఎమ్మెల్యే సఫలీకృతమయ్యారు. రాజకీయ పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశాలు జరిపి వారితో కలిసి రోడ్డు విస్తరణ కారణంగా నష్టపోతున్న వారిని ఓదార్చి నష్టపరిహారం అందిస్తామని హామీలు ఇచ్చి ఒప్పించారు. అయితే మండవ మురళీదర్రావ్ విషయంలో అప్పట్లో అధికారులు, కొందరు నాయకులు మొండిగా వ్యవహరించడంతో అతను కోర్టును ఆశ్రయించడంతో పనులకు బ్రేక్ పడ్డాయి. ఈ విషయాన్ని గ్రహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో ఉన్నతంగా ఆలోచించి ప్రముఖ పౌల్ట్రీ వ్యాపార వేత్త, ఉషోదయ సహస్ర బిల్డింగ్ యజమాని మండవ మురళీదర్ రావ్ తో ప్రత్యేకంగా చర్చలు జరిపి అతనికి నచ్చజెప్పారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టణాబివృద్ధి కోసం తనతో మాట్లాడిన పద్ధతి ఎంతో నచ్చిందని, కూల్చివేతలు చేయవద్దంతో కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నప్పటికి మంచి పనిలో తాను భాగస్వామ్యం కావాలనుకుంటున్నానని మురళీదర్ రావు తెలిపారు. గురువారం నాడు ముందర్ రావ్ స్వయంగా దగ్గరుండి తమ కట్టడాలను కూల్చివేయించాడు. ఈ క్రమంలో తనకు సుమారుగా మూడు కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లుతున్నప్పటికి ఎమ్మెల్యే తనతో చర్చించిన తీరు నచ్చి ఒప్పుకున్నానని తెలిపారు. మండవ మురళీదర్ రావు తీసుకున్న నిర్ణయానికి పట్టణ ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాజీ మంత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నల్లమోతు భాస్కర్ రావు





**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** మాజీ మంత్రులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), తన్నీరు హరీష్ రావు, గుంటకండ్ల జగదీష్ రెడ్డిలను వారి హైదరాబాద్ నివాసాలలో కలిసి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే ,బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ నల్లమోతు భాస్కర్ రావు ఆంగ్ల నూతన సంవత్సరం-2025 శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ..బీఆర్ఎస్ పటిష్టత కోసం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సారధ్యంలో ముందుకు సాగి పార్టీని మరింత బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

## రైతుల పక్షపాతి ప్రధాని మోదీ...!

### బీజేపీ నవాబ్ పేట్ మండల ఇంచార్జ్ రామకృష్ణారెడ్డి..!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని రూ.6 వేల నుంచి రూ.10వేలకు పెంపు ప్రధాని మోదీ రైతులకు నూతన సంవత్సర కానుక ఇచ్చారని బీజేపీ నవాబ్ పేట్ మండల ఇంచార్జ్ రామకృష్ణ రెడ్డి అన్నారు.గురువారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి పీఎం కిసాన్ సహాయం, ఎరువుల సబ్సిడీ పెంచుతూ, ఫసల్ బీమా పరిధిని విస్తరిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాల పట్ల రైతులు హర్షాతీరేకాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అత్యాధునిక సాంకేతికతను దేశానికి అందించడమే కాదు..రైతాంగానికి వ్యవసాయానికి కూడా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అంతే పెద్దపీట వేస్తుందన్నారు.రైతులకు డిజిటల్ విధానంలో పంట బీమాను నేరుగా కేంద్రం చెల్లించాలన్న నిర్ణయం విప్లవాత్మకమైందని తెలిపారు.

## మృతుడు కుటుంబానికి భరోసా ఇచ్చి ఆదుకుంటానని హామీ ఇచ్చిన ఎంపీ. రఘునందన్ రావు.



**కూకట్ పల్లి, డిసెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** ఇటీవల గుండెపోటుతో మరణించిన నంగునూరు మండలం అప్పలచెరువు గ్రామానికి చెందిన బిజెపి ఓబీసీ మండల శాఖ అధ్యక్షుడు గట్టు రవి కుటుంబాన్ని గురువారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవి మరణంతో పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందని అతని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటానని తెలిపారు. పిల్లల చదువు కోసం తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేసేవాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, రజనీకర్ రెడ్డి పరకాల తిరుపతిరెడ్డి, నాంపల్లి శ్రీనివాస్ ,పప్పు సురేందర్, ఎస్ వి సింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 3న నాంపల్లి మండలం పర్యటించనున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

### మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం &ఆదర్శ పాఠశాల సందర్శన

### కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తేదీ:03/01/2025 శుక్రవారం రోజు మధ్యాహ్నం 1 గంటకు నాంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తెలంగాణ ఆదర్శ పాఠశాల పెద్దాపురం సందర్శించడానికి విచ్చేయుచున్న సందర్భంగా నాంపల్లి మండలం పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు రాజన్న అభిమానులు, మహిళలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పర్యటన కార్యక్రమాలను విజయవంతం చేయగలరని నాంపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా కోరారు.




# ఈ-కామర్స్‌కు పోటీగా క్విక్ కామర్స్

## జెప్టో సీఈవో ఆదిత్ పాలీచా

న్యూఢిల్లీ: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంప్రదాయ ఈ - కామర్స్ దిగ్గజాలకు క్విక్ కామర్స్ పోటీనిస్తుందని జెప్టో కో - ఫౌండర్, సీఈవో ఆదిత్ పాలీచా అన్నారు. భారత్‌లో అమెజాన్/ఫ్లిప్‌కార్ట్ స్థాయి ఫలితాన్ని సృష్టించగల సామర్థ్యాన్ని క్విక్ కామర్స్ కలిగి ఉందని 2024లో ప్రజలు గ్రహిస్తారని జెప్టో గతేడాది ప్రకటించిందని నూతన సంవత్సరం సందర్భంగా లింక్డ్‌ఇన్‌లో చేసిన పోస్టులో ఆయన గుర్తు చేశారు. 2025లో క్విక్ కామర్స్ కూడా ఈ%-%కామర్స్‌తో పోల్చదగిన స్థాయిని చేరుకుంటుందని తెలిపారు. ఐపీవో బాటలో ఉన్న జెప్టో 2023%-%24లో నిర్వహణ ఆదాయం 120 శాతం పెరిగి రూ.4,454 కోట్లకు చేరుకుంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జోమాటో బ్లింకిట్ వంటి పోటీ కంపెనీలను అధిగమించింది.

**ప్రతి కంపెనీకి సవాలు..**

కార్యకలాపాలను అసాధారణంగా అమలు చేయడంపై క్విక్ కామర్స్ విజయం ఆధారపడి ఉంటుందని ఆదిత్ నొక్కిచెప్పారు. ఆ స్థాయిలో అమలు చేయడం ప్రతి కంపెనీకి ఒక సవాలుగా ఉంటుందని అన్నారు. '2025లో క్విక్ కామర్స్ యొక్క ప్రాథమిక అంశాలు నాటకీయంగా అభివృద్ధి చెందుతాయి. కస్టమర్ చేసే చెల్లింపులకు తగ్గ విలువ మరింత వేగంగా పెరుగుతుంది. నిర్వహణ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఆర్థికాంశాలు, కార్యక్రమాలు మారతాయి. 2023, 2024తో పోలిస్తే ఈ పరిశ్రమకు క్యాపిటల్ మార్కెట్ వాతావరణం కూడా భిన్నంగా కనిపిస్తుంది' అని అన్నారు. నమ్మశక్యం కాని రీతిలో 2025 ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జెప్టో వేదికగా నూతన సంవత్సర అమ్మకాల్లో 200 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు.


**రికార్డుల న్యూ ఇయర్..**

డిసెంబర్ 31న అత్యధిక విక్రయాలను సాధించామని బ్లింకిట్ ప్రకటించింది. ఒక నిమిషంలో, ఒక గంటలో అత్యధిక ఆర్డర్లతోపాటు.. ఒక రోజులో డెలివరీ భాగస్వాములు అందుకున్న టిప్స్ సైతం అత్యధికమని బ్లింకిట్ సీఈవో అల్బిందర్ ధిండ్సా మైక్రో%-%బ్లాగింగ్ సైట్ ఎక్స్ వేదికగా తెలిపారు. అర్ధరాత్రి 12 ద్రాక్ష పండ్లను తినే సంప్రదాయాన్ని భారతీయులు స్వీకరించినందున నూతన సంవత్సర వేడుక రోజున ఒక రోజులో అత్యధికంగా ద్రాక్షలను విక్రయించినట్లు బ్లింకిట్ పేర్కొంది. స్పానిష్ సంస్కృతిలో పాతుకుపోయిన ఈ ట్రెండ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ టాపిక్‌గా మారిందని వివరించింది.

# అగ్రిటెక్ రంగంలో భారీగా కొలువులు

## వచ్చే 5 ఏళ్లలో 80 వేల వరకు కొత్త ఉద్యోగాలు

## టీమ్‌లీజ్ సర్వీసెస్ సీఎస్‌వో సుబ్బురత్నం వెల్లడి



ముంబై: అగ్రిటెక్ రంగంలో వచ్చే ఐదేళ్లలో కొత్తగా 60%-%80 వేల పైచిలుకు కొలువులు రాగలవని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ (సీఎస్‌వో) సుబ్బురత్నం తెలిపారు. ఏఐ డెవలప్‌మెంట్, టెక్నాలజీ, పర్యావరణహిత వ్యవసాయ సొల్యూషన్స్, సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో ఉద్యోగావకాశాలు ఉండగలవని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా అగ్రిటెక్ రంగంలో సాంకేతిక నిపుణులు, ఆపరేషన్స్ సిబ్బంది, మేనేజర్లు మొదలైన హోదాల్లో 1 లక్ష పైగా ఉద్యోగులు ఉన్నట్లు సుబ్బురత్నం వివరించారు. వ్యవసాయం ఎక్కువగా ఉండే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉద్యోగావకాశాలు అత్యధికంగా ఉండగలవన్నారు. ఇక హైదరాబాద్, బెంగళూరు, పుణె, గురుగ్రామ్‌లాంటి నగరాలు అగ్రిటెక్ స్టార్టప్‌లకు కీలక కేంద్రాలుగా మారగలవని సుబ్బురత్నం చెప్పారు.

**హైబ్రిడ్ ఉద్యోగాలు..**

అగ్రిటెక్ రంగం ప్రధానంగా సాంకేతిక ఆవిష్కరణలు, అనలిటిక్స్ వంటి అంశాలపై దృష్టి పెడుతుంది కాబట్టి ఈ ఉద్యోగాలు సీజనల్‌గా ఉండవని పేర్కొన్నారు. సీజన్‌లో నాట్లు వేయడం నుంచి కోతల వరకు వివిధ రకాల పర్యవేక్షణ కార్యకలాపాల్లో పాలుపంచుకునే సిబ్బంది .. ఆఫ్%-%సీజన్‌లో డేటా విశ్లేషణ, పరికరాల నిర్వహణ మొదలైన వాటిపై పని చేస్తారని చెప్పారు. సాధారణంగా అగ్రిటెక్ ఉద్యోగాలు హైబ్రిడ్ విధానంలో ఉంటాయన్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, డేటా అనలిటిక్స్, పర్యవేక్షణ బాధ్యతలను ఎక్కడి నుంచైనా నిర్వర్తించవచ్చని .. కానీ మెషిన్ ఆపరేటర్లు, ఫీల్డ్ టెక్నీషియన్లు మొదలైన వారు క్షేత్ర స్థాయిలో పని చేయాల్సి ఉంటుందని సుబ్బురత్నం చెప్పారు. కన్సల్టెన్సీ సంస్థ ఈవై నివేదిక ప్రకారం.. ప్రస్తుతం దేశీయంగా వ్యవసాయంలో కేవలం 1.5 శాతమే టెక్నాలజీ వినియోగం ఉంటోందని, ఈ నేపథ్యంలో అగ్రిటెక్ కంపెనీలకు 24 బిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ప్రకారం 2022 నాటికి భారత్‌లో సుమారు 450 అగ్రిటెక్ స్టార్టప్‌లు ఉన్నట్లు వివరించారు.

# స్విగ్గీ హవా.. హైదరాబాద్‌లో రికార్డ్ డెలివరీలు



ఫుడ్ డెలివరీ సంస్థగా మొదలైన 'స్విగ్గీ' నేడు పండ్లు, కూరగాయలు మొదలైన వాటిని డెలివరీ చేస్తోంది. అత్యధిక డెలివరీలతో రికార్డ్ బ్రేక్ చేసి.. అర్ధరాత్రి వరకు కూడా కస్టమర్లను సేవలను అందిస్తూనే ఉంది. హైదరాబాద్‌లో వేగవంతమైన డెలివరీలు చేస్తూ అందరికీ అందుబాటులో ఉంది. జూన్ 2021లో ప్రారంభమైన స్విగ్గీ.. రోజువారీ అవసరాలు, బొమ్మలు, బ్యూటీకి సంబంధించిన వస్తువులు, అలంకరణ సామాగ్రి, పండుగల సమయంలో కావాల్సిన వస్తువులను కూడా డెలివరీ చేస్తోంది. కేవలం 10 నిమిషాల్లో డెలివరీ (%ఖ్షిుర్ ఐవశ్రీఱఙవతీ‌ఎ%) చేస్తున్న వాటిలో పాలు, టమోటా, ఉల్లిపాయలు, కొత్తిమీర, మిరపకాయలు, కిరాణా సామాగ్రి, ఎలక్ట్రానిక్స్ వంటివి ఉన్నాయని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సీఈఓ 'అమితేష్ ఝా' అన్నారు. హైదరాబాద్ (%ఎఎఎవతీఝుఝ్రుఎ%)లో 1.8 కిమీ దూరాన్ని కేవలం 96 సెకన్లలో చేరుకొని డెలివరీ చేసిన ఘనత స్విగ్గీ సొంతం. అంతే కాకూండా.. నగరంలో 2024లో 2 కోట్ల చిప్స్ ప్యాకెట్లను డెలివరీ చేసింది. పాల కోసం 19 లక్షలకు పైగా ఆర్డర్‌లను పొందింది. బ్రెడ్, గుడ్ల కోసం రూ.1.54 కోట్ల విలువైన ఆర్డర్‌లకు స్వీకరించింది. లోదుస్తుల కోసం 18,000 కంటే ఎక్కువ ఆర్డర్‌లు, కండోమ్‌ల కోసం దాదాపు 2 లక్షల ఆర్డర్‌లను స్విగ్గీ స్వీకరించింది. 2024లో 25,00,000 మ్యాగీ ప్యాకెట్లను ఆర్డర్ చేసింది. ప్రజలు ఆర్డర్ చేసిన మ్యాగీ ప్యాకెట్‌లను ఒకదానిపై ఒకటి పేర్చితే ఎవరెస్ట్ పర్వతం కంటే దాదాపు 25 కిలోమీటర్ల ఎత్తు అవుతుందని సమాచారం. మొత్తం మీద అదీ.. ఇదీ అని తేడా లేకుండా ప్రజలకు అవసరమైన వస్తువులను డెలివరీ చేసి అందరికీ అందుబాటులో ఉంది.




# క్రెడిట్‌కార్డుతో పొరపాటున కూడా ఈ లావాదేవీలు చేయొద్దు.. చేశారో అంతే..!

ఆదాయపన్ను శాఖ ప్రతిఒక్కరినీ ఓ కంట కనిపెడుతూ ఉంటుంది. అన్ని లావాదేవీలపైనా నిఘా ఉంచుతుంది. ప్రస్తుతం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగింది. అన్ని రకాల చెల్లింపులకూ క్రెడిట్ కార్డులే వినియోగిస్తున్నారు. అయితే ఆదాయపు పన్ను నోటీసు రాకుండా నివారించాలనుకుంటే పొరపాటున కూడా చేయని లావాదేవీలు కొన్ని ఉన్నాయి. క్రెడిట్ కార్డులతో చేసే కొన్ని లావాదేవీలు నేరుగా ఆదాయపు పన్ను శాఖ దృష్టికి రావచ్చు. మీకు నోటీసు పంపవచ్చు. ఇవి అలాంటి లావాదేవీలైతే, సీఏలు కూడా మిమ్మల్ని రక్షించలేరు. అందుకే ఈ సమాచారం క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు చాలా ముఖ్యమైనది. ఎటాంటి లావాదేవీలు మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తాయో ఇక్కడ తెలుసుకోండి. ఒక సంవత్సరంలో విదేశీ ప్రయాణాలకు రూ.2 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లయితే దాని డేటా ఆదాయపు పన్ను శాఖకు వెళుతుంది. క్రెడిట్ కార్డ్‌పై సంవత్సరానికి రూ.2 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేస్తే, ఆదాయపు పన్ను శాఖ మీపై నిఘా ఉంచుతుంది. రూ. 1 లక్ష కంటే ఎక్కువ నగదు రూపంలో క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులు వంటి పెద్ద లావాదేవీలు శాఖ దృష్టిని ఆకర్షించవచ్చు. ఒక సంవత్సరంలో మ్యూచువల్ ఫండ్స్, షేర్లు లేదా బాండ్లలో రూ.10 లక్షల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టినట్లయితే, ఆదాయపు పన్ను శాఖ నోటీసు పంపవచ్చు. రూ.30 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తిని కొనుగోలు చేసినట్లయితే, దాని సమాచారం ఆటోమేటిక్‌గా ఆదాయపు పన్ను శాఖకు చేరుతుంది. బ్యాంకు ఖాతాలో పెద్ద మొత్తంలో నగదు జమ చేయడం ఆదాయపు పన్ను శాఖ దృష్టిని ఆకర్షిస్తుంది. రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేస్తే నోటీసు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. నగదు రూపంలో జరిగే వ్యాపార లావాదేవీలపై ఆదాయపు పన్ను శాఖ నిఘా ఉంచుతుంది. రూ.50,000 కంటే ఎక్కువ వ్యాపార లావాదేవీల సమాచారం కోసం డిపార్ట్‌మెంట్ మిమ్మల్ని అడగవచ్చు.

# రూ.2000 నోట్లు.. ఇంకా రూ.6,691 కోట్లు



ఉపసంహరించిన రూ.2000 నోట్లలో ఇప్పటి వరకూ 98.12 శాతం తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని, ఇంకా రూ.6,691 కోట్ల విలువైన నోట్లు ప్రజల వద్ద ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. 2023 మే 19న ఆర్బీఐ రూ. 2000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. చలామణిలో ఉన్న రూ.2000 నోట్ల మొత్తం విలువ 2023 మే 19న వ్యాపారం ముగిసే సమయానికి రూ. 3.56 లక్షల కోట్లు ఉండగా 2024 డిసెంబర్ 31న వ్యాపారం ముగిసే సమయానికి రూ.6,691 కోట్లకు తగ్గిందని ఆర్‌బీఐ తాజాగా తెలిపింది. 98.12 శాతం నోట్లు తిరిగి వచ్చాయని పేర్కొంది. రూ. 1000, రూ. 500 నోట్ల రద్దు తర్వాత 2016 నవంబర్‌లో రూ. 2000 నోట్లను ఆర్బీఐ ప్రవేశపెట్టింది.న్ని బ్యాంక్ శాఖల్లో రూ.2000 నోట్లను డిపాజిట్ చేసుకునే లేదా మార్చుకునే సదుపాయాన్ని 2023 అక్టోబర్ 7 వరకు ఆర్బీఐ అందుబాటులో ఉంచింది. ఈ సదుపాయం ఆర్బీఐ 19 ఇష్యూ కార్యాలయాల్లో ఇప్పటికీ అందుబాటులో ఉంది. 2023 అక్టోబరు 9 నుండి ఆర్‌బీఐ ఇష్యూ కార్యాలయాలు రూ. 2000 నోట్లను బ్యాంక్ ఖాతాలలో డిపాజిట్ చేయడానికి స్వీకరిస్తున్నాయి.

## బంగారం ఎంత కొనచ్చు? పెళ్లికానివారికైతే అంతే!

భారత దేశంలో బంగారాన్ని సంపదకు, ఐశ్వర్యానికి చిహ్నంగా పరిగణిస్తారు. మన సంప్రదాయాలలో పసిడి లోతుగా పాతుకుపోయింది. బంగారం కొనడాన్ని భారతీయులు అదృష్టంగా భావిస్తారు. ముఖ్యంగా పండుగ సందర్భాలలో పుత్తడి కొనుగోళ్లు అధికంగా ఉంటాయి. నాణేలు, ఆభరణాలు.. ఇలా వివిధ రూపాల్లో బంగారాన్ని కొని ఇంట్లో పెట్టుకుంటారు. అంతటి ప్రాధాన్యత ఉన్న బంగారాన్ని కొనడానికి ముందు దానికి సంబంధించిన నిబంధనలను తెలుసుకోవడం, అనుసరించడం కూడా అంతే ముఖ్యం. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (%జదీఱ%) మార్గదర్శకాల ప్రకారం, డిక్లేర్డ్ ఆదాయం, వ్యవసాయ ఆదాయం, సహేతుకమైన గృహ పొదుపులు లేదా చట్టబద్ధంగా సంక్రమించిన ఆస్తులతో కొనుగోలు చేసిన బంగారంపై ఎటువంటి పన్నులు ఉండవు. ఇలా కాకుండా వేరే మార్గాల ద్వారా సమకూర్చుకున్న బంగారం పరిమితులకు మించి ఉంటే అధికారులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది.

# ఆఖరి పోరాటం



భారీ ఆశలతో ఆస్ట్రేలియా వెళ్లిన భారత జట్టుకు పదేండ్లుగా నిలబెట్టుకుంటున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కాపాడుకోవడంతో పాటు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తు రేసులో నిలిచేందుకు ఆఖరి అవకాశం. శుక్రవారం నుంచి సిడ్నీ వేదికగా ఆతిథ్య ఆసీస్‌తో టీమ్‌ఇండియా అమీతుమీ తేల్చుకోనుంది. సిరీస్‌లో ఇప్పటికే 1-2తో వెనుకబడి ఉన్న భారత్.. చివరి టెస్టులో సారథి రోహిత్ శర్మపై వేటు వేయనున్నట్టు సమాచారం. రోహిత్‌ను తప్పించి బుమ్రా నాయకత్వంలో ఈ మ్యాచ్ ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక తొలి టెస్టు ఓడినప్పటికీ తర్వాత అనూహ్య రీతిలో పుంజుకున్న ఆసీస్.. సిడ్నీలోనూ గెలిచి సిరీస్‌తో పాటు డబ్ల్యూటీసీ బెర్తును ఖాయం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నది.

**నేడే భారత్, ఆసీస్ చివరి టెస్టు**

**విశ్రాంతి పేరుతో రోహిత్‌పై వేటు?**

**సారథిగా బుమ్రా!**

**గిల్, జురెల్‌కు అవకాశం**

సిడ్నీ: సుమారు నెలన్నర రోజులుగా టెస్టు క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లోని భారత్, ఆస్ట్రేలియా ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ముగింపు దశకు చేరుకుంది. శుక్రవారం నుంచి ప్రఖ్యాత సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ) వేదికగా టీమ్‌ఇండియా, ఆసీస్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. సిరీస్‌లో ఇప్పటికే 1-2తో వెనుకబడి ఉన్న భారత్‌కు ఈ మ్యాచ్ గెలవడం అత్యంత ఆవశ్యకం. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలన్నా.. బీజీటీని నిలబెట్టుకోవాలన్నా టీమ్‌ఇండియాకు ఈ టెస్టులో గెలవడం కీలకం. ఈ మ్యాచ్‌లో ఓడితే పదేండ్లుగా కాపాడుకుంటున్న బీజీటీతో పాటు డబ్ల్యూటీసీ ఆశలు సంపూర్ణంగా వదులుకోవాల్సిందే!

**హిట్‌మ్యాన్‌పై వేటు?**

కీలక మ్యాచ్ కావడంతో హెడ్‌కోచ్ గౌతం గంభీర్ పలు కఠిన నిర్ణయాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. గత కొంతకాలంగా పేలవ ఫామ్‌తో తంటాలు పడుతున్న సారథి రోహిత్ శర్మను సిడ్నీ టెస్టుకు పక్కనబెట్టి బుమ్రాకు నాయకత్వ పగ్గాలు అప్పగించనున్నట్టు సమాచారం. మెల్‌బోర్న్ టెస్టు తర్వాత రోహిత్ రిటైర్మెంట్ గురించి చర్చ జరుగగా సిడ్నీలో ఆడి ఆ తర్వాత టెస్టులకు వీడ్కోలు పలకొచ్చుననే చర్చలు వినిపించాయి. కానీ గంభీర్ మాత్రం అందుకు సిద్ధంగా లేదని తెలుస్తోంది. అదే జరిగితే పెర్త్ టెస్టు మాదిరే బుమ్రా జట్టును నడిపిస్తాడు. భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరకుంటే మెల్‌బోర్న్ టెస్టే రోహిత్ కెరీర్‌లో చిట్టచివరిది అవుతుంది!

**తుది జట్టులో ఎవరుంటారో?**

సిరీస్‌లో భారత్‌ను ప్రధానంగా ఇబ్బందిపెడుతున్నది బ్యాటింగ్ సమస్యే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. రోహిత్‌ను పక్కనబెడితే యశస్వీ జైస్వాల్‌తో పాటు కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా వస్తాడు. గత టెస్టులో ఆడని శుభ్‌మన్ గిల్‌ను తుది జట్టులో ఆడిస్తే అతడు మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. ఇక ఈ సిరీస్‌లో బాధ్యతారాహిత్యంగా ఆడుతున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్‌పైనా వేటు తప్పకపోవచ్చునని జట్టు వర్గాల వినికిడి. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్‌ను ఫైనల్ లెవెన్‌లో చేర్చే అవకాశాలున్నాయి. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సిడ్నీలో అయినా రాణించాలని భారత్ గంపెడాశలు పెట్టుకుంది. జోరుమీదున్న ఆసీస్ బౌలర్లను భారత జట్టు ఎలా ఎదుర్కుంటుందో చూడాలి. సిడ్నీ పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉండటంతో తుది జట్టులో రవీంద్ర జడేజాతో పాటు వాషింగ్టన్ సుందర్‌కూ బెర్త్ దక్కొచ్చు. ఇక పేస్ దళాన్ని బుమ్రా నడిపించనున్నాడు. గాయంతో పేసర్ ఆకాశ్ దీప్ ఈ టెస్టుకు దూరమవడంతో అతడి స్థానాన్ని హర్షిత్ రాణా లేదా ప్రసిధ్ కృష్ణ భర్తీ చేసే అవకాశం ఉంది.

**సిరీస్ పట్టేయాలని..**

మరోవైపు ఆస్ట్రేలియా వరుస విజయాలతో దూకుడుమీదుంది. తొలి టెస్టులో ఓడినప్పటికీ అద్భుతంగా పుంజుకున్న కంగారూలు.. సిరీస్‌లో ఆధిక్యంలో నిలిచి జోరుమీదున్నారు. బుమ్రా, జైస్వాల్, నితీశ్ వంటి కొద్దిమంది తప్పితే ఆస్ట్రేలియా జోరును భారత్ నిలువరించలేకపోతోంది. స్టీవ్ స్మిత్, లబూషేన్ మంచి ఫామ్‌లో ఉండగా తొలి టెస్టు హీరో సామ్ కొన్‌స్టాస్ మరోసారి మెరుపులు మెరిపించాలని ఆ జట్టు కోరుకుంటోంది. మిడిలార్డర్‌లో మిచెల్ మార్ష్ స్థానంలో ఆ జట్టు ఆల్‌రౌండర్ బ్యూ వెబ్‌స్టర్‌ను తుదిజట్టులోకి తీసుకుంది.



## నలుగురికి ఖేల్ రత్న

**గుకేశ్, మనూ, ప్రవీణ్, హర్మన్‌ప్రీత్‌కు పురస్కారం**

**తెలంగాణ అమ్మాయి దీప్తి జివాంజీకి అర్జున**

**జ్యోతి యర్రాజీకీ చోటు**

ఢిల్లీ : గత కొంతకాలంగా వివాదాస్పదమైన 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' అవార్డులను కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన మనూ భాకర్‌తో పాటు చదరంగంలో యువ సంచలనం దొమ్మరాజు గుకేశ్, పారా హైజంపర్ ప్రవీణ్‌కుమార్, హాకీ సారథి హర్మన్‌ప్రీత్ సింగ్‌ను ఖేల్ రత్న అవార్డుకు ఎంపికచేసింది. వీరితో పాటు 32 మందికి అర్జున అవార్డులు ప్రకటించింది. తెలంగాణ అమ్మాయి, గతేడాది ముగిసిన పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించిన దీప్తి జివాంజీకి అర్జున దక్కింది. మరో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ (ట్రాక్ అండ్ అథ్లెటిక్స్) సైతం ఈ జాబితాలో చోటు దక్కించుకుంది. అర్జున అవార్డు సాధించినవారిలో ఏకంగా 17 మంది పారా క్రీడాకారులే ఉన్నారు. పారిస్ ఒలింపిక్స్‌తో పాటు పారాలింపిక్స్‌లో పతకాలు సాధించినవారికి అవార్డులు వరించాయి. క్రీడాకారులతో పాటు ఐదుగురు కోచ్‌లకు ద్రోణాచార్య అవార్డులు దక్కాయి. ఈనెల 17న రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా అవార్డు గ్రహీతలు పురస్కారాలు అందుకోనున్నారు. అర్జున అవార్డు సాధించినవారిలో దీప్తి, జ్యోతితో పాటు బాక్సర్లు నీతూ, స్వీటి, హాకీ క్రీడాకారులు అభిషేక్, జర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ సింగ్ ఉన్నారు. ఒలింపిక్స్‌లో కాంస్యాలతో మెరిసిన సరబ్‌జ్యోత్ (షూటింగ్), రెజ్లర్ అమన్ సెహ్రావత్‌నూ అర్జున వరించింది. పారాలింపిక్స్‌లో సత్తా చాటిన మురుగేశన్, నిత్యశ్రీ, రామదాస్, కపిల్ పర్మర్, సచిన్ ఖిలారి వంటి వాళ్లూ అవార్డులలో చోటు దక్కించుకున్నారు. ద్రోణాచార్య ఆవార్డు సాధించిన వారిలో సుభాష్ రాణా (పారా షూటింగ్), దీపాలి దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ సంగ్వాన్ (హాకీ) ఉన్నారు. ఎస్. మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మండొ ఆగ్నెలో కొలాకో (ఫుట్‌బాల్)కు ద్రోణా చార్య లైఫ్‌టైమ్ అవార్డు దక్కింది.

## లంకకు ఊరట విజయం



నెల్సన్ (న్యూజిలాండ్) : కివీస్ పర్యటనలో టీ20 సిరీస్ ఓడిపోయిన శ్రీలంకకు ఆఖరి మ్యాచ్‌లో ఊరట విజయం దక్కింది. గురువారం జరిగిన మూడో టీ20లో ఆ జట్టు 7 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. కుశాల్ పెరీరా (46 బంతుల్లో 101, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు శతకానికి తోడు అసలంక (46) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. ఛేదనలో న్యూజిలాండ్.. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 211 పరుగుల వద్దే ఆగిపోయింది. రచిన్ రవీంద్ర (69), రాబిన్సనన్ (37), మిచెల్ (35) పోరాడినప్పటికీ కివీస్‌కు ఓటమి తప్పలేదు. చివరి మ్యాచ్‌లో ఓడినప్పటికీ సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తోగెలుచుకుంది.



## గిల్‌కు సమన్లు

అహ్మదాబాద్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోంజీ కుంభకోణం కేసులో భారత స్టార్ క్రికెటర్ శుభ్‌మన్ గిల్‌కు గుజరాత్ సీఐడీ సమన్లు జారీ చేసింది. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న గిల్‌తో పాటు అదే జట్టుకు చెందిన సాయి సుదర్శన్, రాహుల్ తెవాటియా, మోహిత్ శర్మకు సమన్లు జారీ అయ్యాయి. బ్యాంకుల కంటే అధిక వడ్డీలు ఇస్తామని ప్రజలను మోసం చేసిన కేసులో బీజెడ్ గ్రూప్ సీఈవో భూపేంద్ర సింగ్ ఝలాను సీఐడీ ఇదివరకే అరెస్టు చేసి విచారించింది. ఈ గ్రూప్‌నకు చెందిన రూ. 450 కోట్ల లావాదేవీలలో టైటాన్స్ క్రికెటర్ల పెట్టుబడులు ఉన్నట్టు విచారణలో తేలింది. గిల్ రూ. 1.95 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్టు సమాచారం.

## రోహిత్ శర్మ రిటైర్ అయినా ఆశ్చర్యం లేదు: రవిశాస్త్రి

సిడ్నీ: రాబోయే రోజుల్లో రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నా .. దాంట్లో ఆశ్చర్యం ఏమీ ఉండబోదని మాజీ కోచ్ రవి శాస్త్రి అన్నారు. శుభమన్ గిల్ లాంటి యువ క్రికెటర్లు ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లోని చివరి అయిదు ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ అత్యధికంగా 10 రన్స్ కూడా చేయలేకపోయాడు. రేపటి నుంచి ప్రారంభం అయ్యే సిడ్నీ టెస్టుకు ముందు ఇవాళ జరిగిన మీడియా సమావేశానికి రోహిత్ రాకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. టెస్టు కెరీర్‌పై రోహిత్ ఓ నిర్ణయం తీసుకుంటాడని, ఒకవేళ అతను రిటైర్ అయినా షాక్ అయ్యేది ఏమీ లేదని, ఎందుకంటే అతనే యువకుడిగా మారడం లేదన్నారు.



## బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేత

### సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై హైకోర్టు ఆగ్రహం

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. నిందితుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారా అని వ్యాఖ్యానించింది. ఇలాంటి వారిని క్షమించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పిటిషనర్‌కు పూర్వ నేర చరిత్ర ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అనుచిత పోస్టుల వ్యవహారంలో నమోదైన 2 కేసుల్లో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైందని చెప్పారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో బోరుగడ్డ అనిల్‌పై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకోగా.. తాజాగా గురువారం హైకోర్టు కొట్టివేసింది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో బోరుగడ్డ అనిల్ అరాచకానికి హద్దే లేకుండా పోయింది. పోలీసులు సైతం అతనివైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. గుంటూరు నగరానికి చెందిన అనిల్.. కేంద్రమంత్రిగా పని చేసిన రాందాస్ అఠావలె అనుచరుడిగా చెప్పుకొంటూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా చలామణి అయ్యాడు. జగన్‌ను అన్నా అని సంబోధిస్తూ తానూ పులివెందులకు చెందినవాడినేనంటూ వైకాపాతో అంటకాగాడు. జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్యసమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్‌లలో ఇష్టానుసారం దూషణలు చేశాడు. వైకాపా ఐదేళ్ల పాలనలో జగన్‌కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడినా వారిపై అసభ్యకర పదజాలంతో విరుచుకుపడేవాడు. జగన్‌ను వ్యతిరేకిస్తూ మాట్లాడితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ప్రతిపక్షాలకు చెందిన మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి దూషించేవాడు. అప్పట్లో జగన్ పేరు చెప్పి గుంటూరు నగరంలో దందాలు, దౌర్జన్యాలతో హల్‌చల్ చేశాడు.

## వేడెక్కిన ఢిల్లీ ఎన్నికల రాజకీయం

### పోటాపోటీగా ఆప్, బిజెపిల పోస్టర్ల యుద్ధం



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** అసెంబ్లీ ఎన్నికల వేళ.. దేశ రాజధాని దిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆమ్‌ఆద్మీపార్టీ, భాజపా పోటీపడి వినూత్న ప్రచారం చేస్తున్నాయి. ఒకరి లోపాలను మరొకరు ఎత్తిచూపుతూ, హామీల వర్షం కురిపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాజపా విడుదల చేసిన పోస్టర్‌కు ఆప్ తనదైనశైలిలో కౌంటర్ ఇచ్చింది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్ ఒకే అడ్రస్‌లో వందల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని భాజపా ఎక్స్ వేదికగా ఆరోపించింది. ఇంటి యజమానికి తెలియకుండా నకిలీ ఓటర్లను రిజిస్టర్ చేస్తున్నారని దుయ్యబట్టింది. ఇది కేజ్రీవాల్ కొత్త గేమ్ అంటూ తీవ్ర విమర్శలు చేసింది. ఆప్‌నకు నకిలీ ఓటర్లపై ప్రేమ అనే అర్థం వచ్చేలా ఒక పోస్టర్‌ను షేర్ చేసింది. దీనికి ఆప్ కౌంటర్ ఇచ్చింది. ఆ విమర్శను తిప్పి కొడుతూ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) అంటూ కేజ్రీవాల్ ఉన్న ఒక పోస్టర్ వీడియోను పంచుకుంది. ఇదిలాఉంటే.. దిల్లీలో ఓటర్లకు భాజపా నగదు పంపిణీ చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈమేరకు అరవింద్ కేజ్రీవాల్ ఆరెస్సెస్ అధ్యక్షుడు మోహన్ భాగవత్‌కు లేఖ రాశారు. కమలం పార్టీ చేస్తున్న తప్పిదాలను ఆరెస్సెస్ ఆమోదిస్తుందా? అని అందులో ప్రశ్నించారు. ఈ లేఖపై భాజపా స్పందిస్తూ.. ఇలా మీడియా దృష్టిని ఆకర్షించడం కోసం ఆరెస్సెస్ అధ్యక్షుడికి లేఖ రాయడానికి బదులు ఆ సంస్థ నుంచి సేవా స్ఫూర్తిని నేర్చుకోవాలని కేజ్రీవాల్‌కు హితవు పలికింది. దేశ రాజకీయాల్లోనే ఆప్ అవిశ్వసనీయ పార్టీకి ఉదాహరణ అని, దీనిని ప్రజలు అర్థం చేసుకున్నారని భాజపా అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది ఎదురుదాడి చేశారు. అబద్ధాలు చెప్పడం మానుకోవడానికి నూతన సంవత్సరం రోజున కేజ్రీవాల్ తీర్మానించుకోవాలని దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ కేజ్రీవాల్‌కు మరో లేఖ రాశారు.

## బస్సులపై తెగిపడ్డ విద్యుత్ వైర్లు

### దివాకర్ బస్సులు దగ్ధం

**అనంతపురం,(క్రైమ్ మిర్రర్):** అనంత నగరంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సులు దగ్ధమయ్యాయి. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జేసీ దివాకర్ రెడ్డికి చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు దగ్ధమయ్యాయి. బస్సులపై కేవీ 11 వైర్ తెగి నిప్పురవ్వలు పడడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు చుట్టుప్రక్కల వ్యాపించాయి. దీంతో భయాందోళనలకు గురైన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో 4 బస్సులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం గురువారం తెల్లవారుజామున జరిగింది. బస్సుల వద్ద ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## స్టీల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

### ఏడుగురు కార్మికులకు గాయాలు

**తిరుపతి,(క్రైమ్ మిర్రర్):** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పరిశ్రమలోని ఫర్నేస్ బాయిలర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద శబ్దంతో బాయిలర్ పేలిపోయింది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని నాయుడుపేట, నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, స్టీల్‌ప్లాంట్‌లో రాత్రి షిఫ్టులో 50 నుంచి 70 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. వీరంతా బీహార్‌వాసులేనని స్థానికులు చెబుతున్నారు. యాజమాన్యం వివరాలు చెప్పకుండా గోప్యత పాటిస్తుండటంతో అంతా అయోమయం నెలకొంది.

## గోవాలో ఏపీ యువకుడి దారుణ హత్య

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** న్యూ ఇయర్ వేడుకల వేళ గోవాలో దారుణం జరిగింది. కొత్త సంవత్సరం వేడుకలకు గోవా వెళ్లిన ఆంధ్రప్రదేశ్ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. న్యూ ఇయర్ వేడుకల కోసం తాడేపల్లిగూడెం నుంచి ఓ ఎనిమిది మంది యువకులు గోవా వెళ్లారు. డిసెంబర్ 29వ తేదీన అర్ధరాత్రి గోవాలోని ఓ రెస్టారెంట్‌లో 8 మంది దిగారు. 31న అర్ధరాత్రి ఫుడ్ ఆర్డర్ విషయంలో వీరికి.. రెస్టారెంట్ సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.




# రోడ్లపైనే వాహనాలు

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తొచ్చేది కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగరమే. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే అగ్రస్థానం. ఇప్పుడు ట్రాఫిక్ జామ్ పరంగా ఆసియాలోనే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు మొదటిస్థానంలో నిలిచింది. టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 ప్రకారం.. ఆసియాలోనే అత్యంత రద్దీగా ఉండే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు తొలి స్థానంలో నిలిచింది. ఇక్కడ పీక్ అవర్స్‌లో కేవలం 10 కిలోమీటర్ల దూరానికే ఏకంగా 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. అంటే ఈ టెక్‌హబ్‌లోని నివాసితులు ఏటా దాదాపు 132 గంటలపాటు ట్రాఫిక్ జామ్‌లోనే చిక్కుకుపోతారు. అందుకు కారణంగా బెంగళూరులో రద్దీకి తోడు నగరం వేగంగా విస్తరిస్తుండటమే. దక్షిణ, ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా బెంగళూరుకే వెళ్తుంటారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే నివసిస్తుంటారు. దీంతో పట్టణం కూడా బాగా విస్తరిస్తోంది. మరోవైపు ఈ సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రావడం లేదు. నగర రోడ్లలో ప్రయాణం నరకయాతంగా మారిపోయింది. ఇక పీక్స్ అవర్స్, హాలిడేస్‌లో ట్రాఫిక్‌ను తప్పించుకోవడం పెద్ద టాస్క్‌గా మారింది. ఇక ఈ జాబితాలో బెంగళూరు తర్వాత పూణె రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరానికి 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతోంది. ఆ తర్వాత ఫిలిప్పీన్స్‌లోని మనీలా (27 నిమిషాల 20 సెకన్లు) , తైవాన్‌లోని తైచుంగ్ (26 నిమిషాల 50 సెకన్లు), జపాన్‌లోని సప్పోరో (26 నిమిషాల 50 సెకన్లు), తైవాన్‌లోని (26 నిమిషాలు), జపాన్‌లోని నగోయా (24 నిమిషాల 20 సెకన్లు), ఇండొనేషియాలోని జకార్తా (23 నిమిషాల 20 సెకన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. టామ్‌టామ్ ట్రాఫిక్ సూచిక 6 ఖండాల్లోని 55 దేశాల్లో ఉన్న 387 నగరాల మీద రీసెర్చ్ చేసి నివేదిక విడుదల చేసింది. నగరాల్లో సగటు ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులతోపాటు మరికొన్ని అంశాలను ఆధారంగా చేసుకొని నివేదికను సిద్ధం చేసింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే యూకేలోని లండన్ అత్యంత నెమ్మదిగా వాహనాలు కదిలే నగరంగా నిలిచింది. ఇక్కడ సగటున 10 కిలోమీటర్ల దూరానికి 37 నిమిషాల 20 సెకన్ల సమయం పడుతుంది.

## అమరావతి నిర్మాణంలో మరింతవేగం

### త్వరగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ

### నిధులకు కేబినేట్ ఆమోదంతో తొలగనున్న అడ్డంకులు



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** అమరావతి పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం వేగం పెంచింది. మూడేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామన్న సిఎం చంద్రబాబు ప్రకటన మేరకు క్షేత్రస్థాయిలో పనుల్లో కూడా వేగం పెరిగింది. వివిధ పనులకు సంబంధించి నిధుల సమీకరణ జరిగింది. కేబినేట్‌లో కూడా రాజధాని నిర్మాణాలకు ఆమోదం లభించడంతో ఇక పనుల్లో మరింత వేగం పుంజుకోనుంది. ఈ క్రమంలో కొత్త ఏడాది తొలిరోజున పలు పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ) రుణంతో రాజధానిలో చేపట్టబోయే ఐదు పనులకు సీఆర్డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీ) వేర్వేరుగాటెండర్లు ఆహ్వానించాయి. రూ. 2,323.25 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టాయి. సీఆర్డీఏ ఆధ్వర్యంలో రెండు ఎల్పీఎస్ జోన్లలో మౌలిక వసతుల కల్పన, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిల భారత సర్వీసు అధికారుల నివాస సముదాయాల్లో మిగిలిన పనులు చేసేందుకు బిడ్లను ఆహ్వానించారు. ఈ నెల 22 మధ్యాహ్నం 2 గంటల వరకు టెండర్ల దాఖలుకు అవకాశం కల్పించారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు సాంకేతిక బిడ్లను తెరవనున్నారు. వరద నియంత్రణ, ట్రంక్ ఇన్‌ఫ్రా పనుల కోసం ఏడీసీ టెండర్లు పిలిచింది. రాజధాని నగరం జోన్ 1ఏ పరిధి నెక్కల్లులోని కొంతభాగంలో ఎల్పీఎస్ లేఔట్లలో రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రెయిన్లు, విద్యుత్తు, ఇంటర్నెట్ కేబుల్ వేసేందుకు డక్ట్‌ల నిర్మాణం, అవెన్యూ ఎ÷-లాంటేషన్ తదితర పనుల్ని రూ. 448.32 కోట్లతో చేపట్టనున్నారు. జోన్ 1బి ప్రాంతం నెక్కల్లు, శాఖమూరులోని ఎల్పీఎస్ లేఔట్లలోని కొన్నిభాగాల్లో తాగునీటి పైపులైన్లు, పచ్చదనం అభివృద్ధి, తాగునీరు, మురుగునీరు, విద్యుత్తు తీగల కోసం డక్ట్‌ల నిర్మాణ పనులు చేపడతారు. ఇందుకు రూ. 588.04 కోట్లతో టెండర్లు పిలిచారు. ఎమ్మెలే, ఎమ్మెల్సీ, అఖిల భారత సర్వీసు అధికారుల నివాస సముదాయాలకు సంబంధించిన 18 టవర్లలో రూ. 434.32 కోట్లతో విద్యుత్తు, ప్లంబింగ్, శానిటరీ వస్తువుల ఏర్పాటు, సెక్యూరిటీ, అగ్నిమాపక వ్యవస్థ ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. నీరుకొండ రిజర్వాయర్ వద్ద మిగిలిపోయిన వరద నియంత్రణ పనులను రూ. 470.75 కోట్లతో చేపట్టనున్నారు. బిడ్ల దాఖలుకు 22 వరకు గడువు ఇచ్చారు. రాజధానిలో మిగిలిన రోడ్లు, వర్షపు నీటి మళ్లింపు డ్రెయిన్లు, పాదచారుల బాటలు, సైకిల్ ట్రాక్‌లు, పచ్చదనం అభివృద్ధి, వీధి దీపాలు తదితర పనులకు రూ. 381.82 కోట్లతో టెండర్లు పిలిచారు. వీటికి ఈ నెల 23 వరకు గడువు ఇచ్చారు. ఇదే క్రమంలో గురువారం జరిగిన కేబినేట్‌లో కూడా వివిధ పనులకు సంబంధించిన కేటాయింపులకు ఆమోదం లభించింది. సిఆర్‌డిఎ పరిధిలో ఇక పనులను త్వరగా పూర్తి చేసేలా ప్రభుత్వం పూనుకుంది.

## కానిస్టేబుల్ పరుగు పందెంలో అపశృతి

### అస్వస్థతకు గురై యువకుడి మృతి

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియకు సంబంధించిన దేహదారుఢ్య పరీక్షలో అపశ్రుతి చోటు చేసుకుంది. కృష్ణా జిల్లాలో గురువారం జరిగిన 1600 మీటర్ల పరుగు పందెంలో ఏ కొండూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్(26) అనే యువకుడు తీవ్ర అస్వస్థతకు లోనై కిందపడిపోయాడు. దీంతో పోలీసు సిబ్బంది వెంటనే చికిత్స కోసం యువకుడిని ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో డిసెంబర్ 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లు జరుగుతున్నాయి. దీంట్లో భాగంగా ప్రతి రోజూ ఆయా కేంద్రాల్లో 600 మంది చొప్పున అభ్యర్థులకు ఈవెంట్లు నిర్వహిస్తున్నారు.

### ముండ్లమూరులో మరోసారి భూకంపనలు

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ప్రకాశం జిల్లాలో మరోసారి భూప్రకంపనలు భయాందోళనలకు గురిచేశాయి. గురువారం మధ్యాహ్నం జిల్లాలోని రేపాయి, ముండ్లమూరు మండలంలోని గ్రామాల్లో సెకన్ పాటు భూమి కంపించింది. దీంతో భయాందోళనకు గురైన స్థానికులు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గత నెల ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలంలో గత నెల 21,22వ తేదీల్లో వరుసగా ఉదయం 10.35 నుంచి 10.40 గంటల మధ్య కొన్ని క్షణాలపాటు రెండురోజులు భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు లోనయ్యారు. ముండ్లమూరు, శింగన్నపాలెం, వేంపాటు, పెద్దఉల్లగల్లు, పసుపుగల్లు గ్రామాల్లో భూమి కంపించిందని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. తాజాగా గురువారం కూడా ఇదే మండలంలోని పలు గ్రామాల్లో భూమి కంపించడం ఆందోళనకు గురి చేస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

# మహేశ్‌బాబు మూవీలో ప్రియాంక చోప్రా

మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఓ చిత్రంలో ప్రియాంక చోప్రా ఛాన్స్ కొట్టేసింది. ఎంబి29'గా ఇది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఇదీ ఒకటి. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్నట్లు గతంలో వార్తలు జోరుగా ప్రచారం అయ్యాయి. ఇప్పుడు మరో నటి పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు జరిపినట్లు టాక్ వినిపిస్తుంది. ఇందులో హీరోతోపాటు హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెను తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రియాంక కూడా ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారట. ఈ పాత్ర కోసం ఇప్పటికే ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టారట. ఇక ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.





# 'ఆర్‌ఆర్‌ఆర్ బిహైండ్ అండ్ బియాండ్'

## మేకింగ్ టీమ్‌ను అభినందించిన రాజమౌళి

'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' కోసం వర్క్ చేసిన టీమ్‌ను ఉద్దేశించి అభినందిస్తూ..దర్శకుడు రాజమౌళి తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. టీమ్ పనితనాన్ని ఆయన మెచ్చుకున్నారు. అందరూ అద్భుతంగా పని చేశారని అన్నారు. 'దాదాపు 13 ఏళ్ల క్రితం ప్రదీప్‌ను కలిశా. ఒక అభిమానిగా అతడు నాకు అప్పుడు తెలుసు. ఈరోజు ప్రదీప్‌తోపాటు వాల్స్ అండ్ ట్రెండ్స్‌లోని అతడి టీమ్ 'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' కోసం ఎంతో వర్క్ చేశారు. మరో ఫ్యాన్ గర్ల్ శిరీష, వంశీ మంచి టాలెంట్ ఉన్న ఎడిటర్లు. 20టీబీ డేటాలో సరైన ఫుటేజ్‌ను కనుగొనడం అంత సులభమైన విషయం కాదు. సినిమా కంటే డాక్యుమెంటరీ చాలా ఎమోషనల్‌గా ఉందని వస్తోన్న ప్రశంసలే వారి ప్రతిభకు నిదర్శనం. టీమ్ విషయంలో చాలా గర్వంగా ఉన్నా. వీళ్లందరూ మరెన్నో ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరుకుంటున్నా' అని రాజమౌళి పేర్కొన్నారు. భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచదేశాలకు వ్యాప్తి చేసిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్' . రామ్‌చరణ్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఈ చిత్రం 2022లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు రాబట్టిన విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ (నాటు నాటు పాటకు) అవార్డు కూడా సొంతం చేసుకుంది. ఈ సినిమా చిత్రీకరణ విశేషాలను తెలియజేస్తూ ఇటీవల చిత్రబృందం 'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' అనే డాక్యుమెంటరీ సిద్ధం చేసింది. తాజాగా ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైంది. సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ, షూటింగ్‌లో చోటుచేసుకున్న సరదా మూమెంట్స్, నటీనటులు, దర్శక నిర్మాతల అనుభవాలతో ఈ డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది. దీనిని చూసిన ప్రతిఒక్కరూ టీమ్‌ను ఎంతగానో మెచ్చుకుంటున్నారు. సినిమాతో పోలిస్తే డాక్యుమెంటరీ ఎంతగానో మనసుని హత్తుకుందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, డాక్యుమెంటరీ విభాగంలో ఇది కనుక ఆస్కార్‌కు వెళితే తప్పకుండా అవార్డు వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# మార్కో తెలుగు ట్రైలర్ విడుదల




ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' ఇటీవల మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. రూ.30కోట్లతో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన వారంలో రోజుల్లోనే రూ.80కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు లెక్కగట్టాయి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదలైంది. యాక్షన్ సన్నివేశాలను పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

# బేబీ బంప్ ఫొటోలతో సామ్ హల్‌చల్

టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఏమాయ చేశావే చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ సుందరి.. అతి కొద్ది రోజుల్లోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం మంచి ఫామ్‌లో ఉండగానే టాలీవుడ్ నటుడు నాగచైతన్యను ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతడితో విడాకులు తీసుకుని సింగిల్‌గా ఉంటోంది. ఈ క్రమంలో సమంతకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట షేక్ చేస్తున్నాయి. ఆ ఫొటోల్లో సామ్ బేబీ బంప్ తో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవిగా తెలిసింది. ఏఐ సాయంతో సమంత బేబీ బంప్ ఫొటోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. నాగచైతన్యతో విడాకుల అనంతరం మాతృత్వాన్ని అనుభవించాలని ఉందంటూ సామ్ అప్పట్లో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ బంప్ ఫొటోలు చూసిన వారంతా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటున్నారు.




# పుష్ప-2 నుంచి షెకావత్ పాట విడుదల

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'పుష్ప 2 ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయిక నటించింది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వరల్డ్ వైడ్‌గా రూ.1700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది ఈ చిత్రం. అయితే ఈ మూవీ నుంచి ఫుల్ వీడియో సాంగ్‌లను ఒక్కొక్కటిగా వదులుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'పుష్ప రాజ్' సాంగ్‌తో పాటు 'దెబ్బలు పడతాయ్ రో.. దెబదెబ్బలు పడతాయ్ రో.. కిస్ కిస్ కిస్సిక్' సాంగ్‌లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మూవీలో ఇంటర్వెల్ ముందు వచ్చే దమ్ముంటే పట్టుకోరా షెకావత్ పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్ అనే సాంగ్‌ను విడుదల చేసింది. థియేటర్‌లో ఉర్రుతలు ఊగించిన ఈ సాంగ్ విడుదలయ్యింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.